విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 సంచిక :99 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ శనివారం 29 ఆగస్టు 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం



- గ్రీన్ బోర్డ్ ఛైర్మన్ నాగబాబు
- మంగళగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో గ్రీన్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాగబాబు
- ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నాగబాబు దంపతులు
- రాష్ట్రంలో 29 శాతం గ్రీనరీ ఉంది, దానిని 2047 నాటికి 50 శాతానికి పెంచేందుకు కృషి చేస్తా

అమరావతి

రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని గ్రీన్ బోర్డ్ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చెప్పారు. మంగళగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో గ్రీన్ బోర్డు ఛైర్మన్‌గా నాగబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో 29 శాతం గ్రీనరీ ఉందని, దానిని 2047 నాటికి 50 శాతానికి పెంచేందుకు కృషి చేస్తానన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రీన్ బోర్డ్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు - మిగతా3లో




## శాంతియుత పరిష్కారానికి ఇరుదేశాలు అంగీకారం

- భారత్-చైనా సరిహద్దు వివాదం
- సరిహద్దు ఒప్పందంపై భారత్-చైనా చర్చలు
- త్వరలోనే సానుకూల ఫలితాలు- భారతవిదేశాంగ శాఖ వెల్లడి
- సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో వీలైనంత త్వరగా మంచి ఫలితాలు సాధించాలని ఇరుదేశాలు నిర్ణయించాయి

### డబ్బుతో గెలవాలని చూసేవారికి

# ఓటమి తప్పదు



- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక

అమరావతి

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. - మిగతా3లో



## నేపాల్‌లో 579 మంది మృతి

- కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు
- 1924 మంది గల్లంతు
- రసువా జిల్లాల్లో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం
- దిగువకు ప్రవహించి పలు జిల్లాల్లో బీభత్సం
- పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి
- వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి
- టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి.

## చైనాలో భూకంపం



- రిక్టర్‌స్కేల్‌పై 5.1 తీవ్రతతో నమోదు
- నేపాల్‌లో మరో హెచ్చరిక జారీ
- చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో భూకంపం
- భూమికి 13 కి.మీ. లోతులో ప్రకంపనలు
- వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రెస్క్యూ టీమ్‌ను వెనక్కి రప్పిస్తున్న అధికారులు

## సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత

- నెల జీతం విరాళంగా ఇచ్చిన నేపాల్ మంత్రులు
- నేపాల్‌లో వరద సహాయక చర్యలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్ష
- నేపాల్ వరదల బాధితులను ఆదుకునేందుకు ప్రధాని, మంత్రుల కీలక నిర్ణయం

### వైఎస్ఆర్‌సీపీ నేతల

# మాస్టర్ ప్లాన్లు



- తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండా
- ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది
- తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు

విశాఖపట్టణం

ఉత్తరాంధ్ర రాజకీయం ఎప్పుడూ కుల సమీకరణాలు, బలమైన కుటుంబాల ఆధిక్యత చుట్టూనే తిరుగుతుంటుంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ వంటి దిగ్గజాలు ప్రస్తుతం ఒకే రకమైన రాజకీయ ప్రాధాన్యతతో అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండాగా కనిపిస్తోందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి. విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. బొత్స సత్యనారాయణ భార్య, సోదరులు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే, ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. - మిగతా3లో

## 24 గంటలు తాగునీటి సరఫరా



- ఒంగోలుకు 24 గంటలపాటు తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగులు
- రంగరాయుడుచెరువు వద్ద తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభించిన లోకేశ్
- 51,340 హౌస్ సర్వీస్ కనెక్షన్లతో ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చేలా ప్రణాళిక
- ఒంగోలు రాజసం ఉట్టిపడేలా ఒంగోలు గిత్త విగ్రహావిష్కరణ
- ఒంగోలు మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకల్లో మంత్రి లోకేశ్

హైదరాబాద్

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నగరంతో ప్రత్యేక అనుబంధం ఉన్న 20 మంది ప్రముఖుల విగ్రహాలను మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని రంగరాయుడు చెరువులో అమృత్ 2.0 పథకం కింద తాగునీటి ప్రాజెక్టును మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఒంగోలు నగర ప్రజలకు 24 గంటలు తాగునీటిని అందించే దిశగా 424.42 కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని మొత్తం 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను రీ-జోనింగ్ చేసి, 605.30 - మిగతా3లో

# అప్పుడు ముద్దు... ఇప్పుడు వద్దా...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు అసలు వద్దు.. ప్రతీ చోటా పోటీకి దిగి తీరాల్సిందే అంటూ ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు అయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వనని తేల్చేశారు. ఇదే జగన్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక పోరులో సరికొత్త రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు నమోదు కావడం, ఇప్పుడు దానికి భిన్నంగా ఆయన వ్యాఖ్యానించడమే దీనికి ప్రధాన కారణం.వైసీపీ పాలనా కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ఏకగ్రీవాల హవా ఎంతలా సాగిందో అర్థమవుతుంది. ఆనాడు రాష్ట్రంలో మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఏకంగా 126 స్థానాలు పోటీ లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎంపీటీసీల విషయానికొస్తే మొత్తం 9,696 స్థానాలకు ఎన్నికలు ప్రకటిస్తే, రికార్డు స్థాయిలో 2,371 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 2,271కి పైగా స్థానాలను అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే సొంతం చేసుకుంది. 2021 స్థానిక పోరులో పంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు వేల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కానీ నేడు ప్రతిపక్షంలోకి రాగానే జగన్ ఏకగ్రీవాలకు స్వస్తి పలికి ఓటింగ్ జరగాల్సిందే అని పట్టుబట్టడం రాజకీయ శైలిలోని వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాటి అధికార పార్టీ ఏకగ్రీవాల దిశగా వేగంగా అడుగులు వేసింది. నాలుగు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 13,097 పంచాయతీలకు గాను 2,196 పంచాయతీలు, అలాగే 1,31,325 వార్డులకు గాను 47,400 కంటే ఎక్కువ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో చూస్తే.. 11 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీల్లోని మొత్తం 2,711 వార్డులలో 590 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 37 డివిజన్లు, కడప కార్పొరేషన్ పరిధిలోనూ సింహభాగం ఏకగ్రీవాలు అయ్యాయి.ఇప్పుడు వైఎస్ జగన్ ఏకగ్రీవాలు వద్దు అని చెప్పడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్రిక్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకే ఏకగ్రీవాలు చేసుకునేందుకు ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉంటాయి. అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థతో పాటు స్థానిక ప్రభావం కూటమి వైపు ఉండే అవకాశం ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపితే ప్రత్యర్థి పార్టీలే మెజారిటీ స్థానాలను పోటీ లేకుండా కైవసం చేసుకుంటాయనే ముందస్తు అంచనా జగన్‌లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ముఖ్యం. ఏకగ్రీవాలకు ఒప్పుకుంటే గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతారు. ఓటింగ్ వరకు వెళ్తేనే అధికార కూటమిని నిలదీసే అవకాశం లభించడమే కాకుండా, రాబోయే రోజుల్లో కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని జగన్ భావిస్తున్నారు. అందుకే ఏకగ్రీవాల ప్రక్రియను నిరోధించడం ద్వారా కూటమికి సులువైన విజయం దక్కకుండా అడ్డుకోవాలనేది వైసీపీ వ్యూహం.ఈ నిర్ణయంలో ఒక రాజకీయ వైరుధ్యం కూడా కనిపిస్తోంది. తమ హయాంలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వాటిని సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని సమర్థించుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు మాత్రం ఏకగ్రీవాలు జరిగితే అది అక్రమమే, బెదిరింపుల వల్లే జరుగుతోంది అనే ప్రచారం చేయడానికి సిద్ధమవ్వాల్సి వస్తోంది. ఏది ఏమైనా.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని వ్యతిరేకించడం అనేది ఏపీ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వస్తున్న అధికార-ప్రతిపక్షాల పాత ఫార్ములానే అని చెప్పవచ్చు.



# పాపం... మోపిదేవి...

**గుంటూరు :** మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ పరిస్థితి రెండిటికీ చెడ్డ రేవడిగా మారింది. ఇటు పార్టీ మారినా ప్రయోజనం లేదు. ఏ పదవి లేకుండానే ఏళ్లు గడచిపోతున్నాయి. రాజ్యసభ పదవిని వదులుకుని మరీ వైసీపీ నుంచి బయటకు వచ్చిన మోపిదేవి వెంకటరమణ తన రాజకీయం పతనాన్ని తానే కొనితెచ్చుకున్నట్లయింది. గత కొన్నేళ్ల నుంచి మోపిదేవి గురించి ఊసే వినిపించడం లేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉండాల్సిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేసినా ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నా ఆయనకు అవకాశం దక్కడం లేదు. రానున్న కాలంలో పదవి దక్కుతుందన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. ఎందుకంటే టీడీపీలోనే అనేక మంది పదవుల కోసం ఆశావహులు సుదీర్ఘకాలం నుంచి ఎదురు చూస్తున్నారు. దీంతో మోపిదేవి వెంకటరమణ కు ఈ టర్మ్ లో పదవి దక్కే అవకాశం లేదన్నది వాస్తవం. అయితే ఆయన ఇటీవల కాలంలో పూర్తిగా మౌనంగా ఉంటున్నారు. వైసీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఓటమి పాలయినా జగన్ తన కేబినెట్ లో చోట కల్పించారు. ఎమ్మెల్సీని చేసి మరీ మోపిదేవి వెంకటరమణ ను మంత్రివర్గంలో స్థానం కల్పించారు. తర్వాత శాసనమండలి రద్దు ప్రతిపాదన చేయడంతో మంత్రి పదవి నుంచి తప్పించి మోపిదేవిని రాజ్యసభకు పంపారు. అయితే 2024 లో వైసీపీ ఓటమి తర్వాత ఎవరూ ఊహించని విధంగా మోపిదేవి వెంకటరమణ వైసీపీని వీడటం చర్చనీయాంశమైంది. ఇంకా పదవీ కాలం ఉన్నప్పటికీ తన పదవిని వదులుకున్న మోపిదేవి వెంకటరమణకు టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి పదవి ఇవ్వలేదు. ఇక నియోజకవర్గంలోనూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉండటంతో అక్కడ మోపిదేవి సాధారణ కార్యకర్తగానే మారిపోయి ఉండాల్సి వచ్చింది. అసలు పార్టీ ఎందుకు మారారు? ఏం సాధించారు? అన్న ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం మాత్రం లేదు.ఇప్పటి వరకూ చాలా ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో మోపిదేవి పేరు కనిపించలేదు. మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది? అని ఆయన అనుచరులే ప్రశ్నిస్తున్నారు. అనేక రాజకీయ పరిణామాల నేపథ్యంలో మోపిదేవి వెంకటరమణ లాంటి సీనియర్ నేతలు పార్టీలు మారడం వల్ల రెండు వైపులా భిన్నమైన చర్చలు జరుగుతుంటాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మోపిదేవి వెంకటరమణ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన సందర్భంలో, కొందరు ఆయన నిర్ణయాన్ని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. .ఈ రాజకీయ పరిణామాలు లేదా మోపిదేవి వెంకటరమణ గారి ప్రస్తుత రాజకీయ పాత్ర ఎలాంటి స్పష్టత లేదు. ప్రస్తుతం ఏ పదవి లేకుండా మోపిదేవి వెంకటరమణ విశ్రాంతి తీసుకోవడం తప్ప ఆయన చేసిందేమీ ఉండదన్న వ్యాఖ్యలు కొంత ఘాటుగానే వినిపిస్తున్నా అందులో మాత్రం నిజం ఉందంటున్నారు.



# ఫినిషింగ్ దశకు కడప స్టార్టప్ హబ్

**కడప :** రాయలసీమ ప్రాంతంలో ఐటీ, సాంకేతిక రంగాల ముఖచిత్రాన్ని మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కడప స్టార్టప్ హబ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకే పరిమితమైన స్టార్టప్ సంస్కృతిని రాయలసీమ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది రూపుదిద్దుకుంది. స్థానిక నిరుద్యోగ యువత ఉన్నత చదువుల అనంతరం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే కొత్త ఆవిష్కరణలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు ఇది అద్భుత వేదికగా నిలవనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన ఈ భవనాన్ని త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు కడప జిల్లా యంత్రాంగం వేగంగా సన్నాహాలు చేస్తోంది.ఉద్యోగాల కోసం ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి" అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా జిల్లా పాలనా యంత్రాంగం ఈ ప్రాజెక్టును ఆకృతి చేసింది. స్టార్టప్ కడప పేరుతో పిలిచే ఈ ప్రతిష్టాత్మక హబ్‌ను ఖ4 మోడల్‌లో రూపొందించారు. ఐఐటీలు, ఐఐఎంల నిపుణులు, గ్లోబల్ టెక్ కంపెనీల అధిపతులతో విద్యార్థులు , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మెంటార్‌షిప్ ఇచ్చేలా దీనికి శ్రీకారం చుట్టారు.ఈ స్టార్టప్ హబ్ నిర్మాణాన్ని కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో శరవేగంగా పూర్తి చేశారు. మొత్తం రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉ+3 ఆకృతిలో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ రూ. 3 కోట్లు మంజూరు చేయగా, ప్రముఖ మౌలిక వసతుల సంస్థ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ తమ ఆఫీ నిధుల కింద రూ. 4 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. మిగిలిన నిధులను జిల్లా యంత్రాంగం సేకరించి నిర్మాణాన్ని పూర్తి చేసింది.ఈ భవనంలో ఒకేసారి 400 మందికి పైగా పనిచేసుకునేలా ప్లగ్ అండ్ ప్లే వర్కింగ్ స్పేస్ వసతిని కల్పించారు. సరికొత్త బిజినెస్ ఐడియాతో వచ్చే యువతకు హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రొటోటైపింగ్ ల్యాబ్‌లు, లీగల్, ఫైనాన్షియల్ సలహాలతో పాటు ఫండింగ్ సమకూర్చే గ్లోబల్ వెంచర్ క్యాపిటలిస్టులను కూడా ఇక్కడికి అనుసంధానించనున్నారు. కడపను ఐటీ, ఆవిష్కరణల నిలయంగా మార్చే దిశగా ఈ భవన ప్రారంభోత్సవం సరికొత్త మైలురాయిగా నిలవనుందని స్థానిక పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.జగన్ ఎప్పుడూ కడపకు ఐటీ గురించి ఆలోచించలేదు.. ఫిష్ మార్టుల గురించి మాత్రమే గొప్పగా చెప్పేవారు. అందుకే కనీసం క్రెడిట్ తీసుకునేందుకు ఒక్క శాతం కూడా చాయిస్ లేకుండా పోయింది.



కడపలో నిర్మించిన స్టార్టప్ హబ్

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

-మొదటిపేజీ తరువాయి

పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు.

రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019-24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

నాగబాబు ధన్యవాదాలు తెలిపారు. గ్రీనరీ మీద నాకు చాలా ఆసక్తి ఉంటుంది. నేను ముందు నుంచీ మొక్కలు నాటడం కోసం కార్యక్రమాలు నిర్వహించేవాడ్ని. పవన్ కల్యాణ్‌కు కూడా పర్యావరణం, పచ్చదనం అంటే ఇష్టం. మా ఇద్దరి ఆలోచనలు ఇక్కడ కలుస్తాయి. రాష్ట్రాన్ని హరితహారంగా మార్చడమే మా బాధ్యత. ఇంతకు ముందు నాకు సంతోషాన్ని ఇస్తుంది కాబట్టి మొక్కలు నాటడం, ప్రకృతి కాపాడటంలో ముందున్నాను. ఇకపై బాధ్యతగా ఈ పని చేస్తా. ఇది నాకెంతో సంతృప్తినిస్తుందని ఆశిస్తున్నాను.' సీఎం అభినందనలు: ముఖ్యమంత్రి చంద్రబాబుని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కలిశారు. నేడు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని సతీసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సత్కరించి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## 24 గంటలు తాగునీటి సరఫరా

-మొదటిపేజీ తరువాయి

కిలోమీటర్ల పొడవున తాగునీటి పంపిణీ నెట్‌వర్క్ అభివృద్ధి చేశారు. దీని ద్వారా 51,340 హౌస్ సర్వీస్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన తాగునీటి సరఫరా అందనుంది. నగరంలో నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించి, ప్రజలకు నిర్ణీత సమయాల్లో మాత్రమే కాకుండా 24 గంటలూ తాగునీరు అందుబాటులో ఉండేలా చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. పెరుగుతున్న ఒంగోలు నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన, స్థిరమైన నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

రాడిసన్ హోటల్‌కు భూమిపూజ

ప్రకాశం జిల్లా అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో 100 కోట్ల రూపాయల పెట్టుబడితో నిర్మించనున్న రాడిసన్ హోటల్‌కు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్? భూమిపూజ చేశారు. రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్మించనున్న ఈ హోటల్ ఒంగోలు పరిసర ప్రాంతాల్లో తొలి 5-స్టార్ హోటల్‌గా నిలవనుంది. 151 లగ్జరీ గదులు, రెస్టారెంట్, బార్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్‌తో పాటు కార్పొరేట్ సమావేశాలు, వివాహాలు, సదస్సుల కోసం భారీ బ్యాంకెట్ హాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్‌హెచ్-16కు సమీపంలో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు ద్వారా బిజినెస్, టూరిజం రంగాలకు ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. కార్యక్రమం అనంతరం మంత్రి లోకేశ్? కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయంగా పలకరించి అర్జీలు స్వీకరించారు

## వైఎస్ఆర్‌సీపీ నేతల మాస్టర్ ప్లాన్లు



-మొదటిపేజీ తరువాయి

స్థానిక పోరు ద్వారా సీటు ఖాయం చేసుకుంటే.. భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానాలకు ఆమెను సులువుగా తీసుకురావచ్చనేది బొత్స ప్లాన్. పార్టీ అధికారాన్ని కోల్పోయిన సమయంలో కేడర్‌ను కాపాడుకోవడంతో పాటు, తమ సొంత వారసులకు స్థానిక సంస్థల ద్వారా అధికారిక గుర్తింపు తీసుకురావడం సీనియర్ నేతలకు రెండు రకాలుగా కలిసివచ్చే అంశం. ఇక శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ధర్మాన సోదరుల రూట్ కూడా ఇంచుమించు ఇదే దారిలో సాగుతోంది. ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడిని, కృష్ణదాస్ తన కుమారుడు కృష్ణ చైతన్యను ఇప్పటికే నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా తిప్పుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత.. కుమారులను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడానికి స్థానిక ఎన్నికల కంటే మంచి అవకాశం మరొకటి ఉండదని ధర్మాన సోదరులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ లేదా కార్పొరేషన్ స్థాయి పోటీల ద్వారా వీరిని క్షేత్రస్థాయికి అలవాటు చేయాలని చూస్తున్నారు.ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్విస్ట్ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీని నడిపించడం కంటే, తమ కుటుంబ రాజకీయ వారసత్వం చేజారిపోకుండా చూసుకోవడానికే ఈ సీనియర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారం చేతిలో లేని సమయంలో పార్టీ తరఫున గట్టిగా పోరాడే కంటే, స్థానిక ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ వారసులకు ప్రజాప్రతినిధి ముద్ర వేస్తే, భవిష్యత్తులో అధికార మార్పిడి జరిగినప్పుడు సులువుగా స్థిరపడవచ్చనేది వీరి ఆలోచన. ఈ వారసత్వ రాజకీయాల ఎత్తుగడలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి స్థానిక ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో సీనియర్లు తమ ప్రభావంతో వారసులను గెలిపించుకోవడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. పైగా వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న కేడర్ ఈ వారసత్వ నిర్ణయాలను ఎంతవరకు ఆమోదిస్తారనేది ప్రశార్థకమే.ఉత్తరాంధ్ర వైసీపీ సీనియర్లు బొత్స, ధర్మాన సోదరులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీ ఉనికిని చాటుకునే పోరాటం మాత్రమే కాదు. తమ రాజకీయ వారసుల భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్ష . తమ బలాన్ని ఉపయోగించి వారసులను స్థానిక పీఠాలపై కూర్చోబెట్టి పొలిటికల్ రీ-లాంచ్ చేస్తారా లేక అధికార కూటమి ధాటికి డిఫెన్స్‌లో పడతారా అనేది వేచి చూడాలి.

# ఏటికొప్పాక హస్తకళల ఇతివృత్త ఉద్యానవనానికి భూమి పూజ.







**యలమంచిలి, పెన్ సత్తా, ఆగస్టు 28:** ఏటికొప్పాక గ్రామంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఏటికొప్పాక హస్తకళల ఇతివృత్త ఉద్యానవనానికి శుక్రవారం ఉదయం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ రవి పటాన్ శెట్టి, యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులు, శాసనసభ్యులు ఏటికొప్పాక హస్తకళాకారుల పనితీరును పరిశీలించారు. కళాకారులు తయారు చేస్తున్న లక్క బొమ్మలు, సహజ రంగుల వినియోగం, సంప్రదాయ హస్తకళా విధానాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ మాట్లాడుతూ ఏటికొప్పాక హస్తకళలకు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక మైన గుర్తింపు ఉందన్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ఏటికొప్పాక లక్క బొమ్మలకు పద్మశ్రీ, జాతీయ స్థాయి అవార్డులు రావడం గ్రామానికి, కళాకారులకు గర్వకారణమన్నారు. ప్రకృతి సిద్ధమైన రంగులను ఉపయోగించడం ఏటికొప్పాక కళాకారుల ప్రత్యేకత అని పేర్కొన్నారు.

యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ కుమార్ మాట్లాడుతూ ఈ ఉద్యానవన నిర్మాణానికి సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఏటికొప్పాక గ్రామానికి, హస్తకళాకారులకు ఒక పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చే గొప్ప అవకాశాన్ని కల్పించారని తెలిపారు. ఏటికొప్పాకలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి ఈరోజు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో హస్తకళాకారుల సంక్షేమం, ఆరోగ్యం, జీవనోపాధి, ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక అభివృద్ధి వంటి అంశాల పై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో హస్తకళల ప్రదర్శన, చేపట్టినట్లు శాసనసభ్యులు పేర్కొన్నారు. ఏటికొప్పాక లక్క బొమ్మలకు మరింత మార్కెట్ కల్పించి, ప్రపంచవ్యాప్తంగా వాటి ప్రాచుర్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏటికొప్పాకలోని హస్తకళా హబ్, థీమ్ పార్క్ అభివృద్ధితో పాటు సమీప ప్రాంతంలో రిసార్ట్ ఏర్పాటు, లెఫ్ట్ కెనాల్‌కు అనుమతులు తీసుకుని బోటు షికారు వంటి పర్యాటక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయడానికి సంబంధిత శాఖలతో చర్చిస్తున్నామని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏటికొప్పాక లక్క బొమ్మలకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్న ఆయన, ఏటికొప్పాకను భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా, హస్తకళా హబ్‌గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏటికొప్పాక కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ ప్రజలు, యువకులు, కూటమి నాయకులు తదిరులు పాల్గొన్నారు.

# జల హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి







- వచ్చేనెల 2న పాయకరావుపేటకు సీఎం చంద్రబాబు రాక
- జలహారతి కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు
- అధికారులతో మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర సమీక్ష

**నక్కపల్లి, పెన్ సత్తా ఆగస్టు 28 :** పాయకరావుపేట నియోజకవర్గంలో సెప్టెంబర్ 2న నిర్వహించే జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సెప్టెంబర్ 2న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా వివరించగా మంత్రులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు పాయకరావుపేట నియోజకవర్గానికి మూడోసారి రాబోతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పటి నుంచో ఆంధ్రప్రదేశ్ ప్రజల కలగా ఉందని, ఆ కలను సాకారం చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబు అని పేర్కొన్నారు. సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని హోం మంత్రి అన్నారు. గోదావరి జలాలు అందుబాటులోకి రావడం వల్ల అనకాపల్లి జిల్లాలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గోదావరి జలాలకు ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజలు, అధికారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఎం పర్యటన సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటిదని అన్నారు. సీఎం పర్యటనలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీఎం పర్యటనకు వేలాది మంది ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కొల్లు రవీంద్ర సూచించారు. సభా ప్రాంగణం, రహదారులు, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావడం ద్వారా ఈ ప్రాంత వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని మంత్రులు పేర్కొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంతో పాటు జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# వీసం రామకృష్ణకు రాఖీ కట్టిన జడ్పీటిసి కాసులమ్మ



**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 28:** రాఖీ పౌర్ణమి సందర్భంగా నక్కపల్లి మండలం జడ్పీటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం రామకృష్ణ ఇంటి వద్ద రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. అలాగే వైస్ ఎంపీపీ వీసం నానాజీకి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సోదరి గోసల కాసులమ్మ ఎన్నో ఏళ్లగా రాఖీ కడుతున్నారని తమ బంధం జీవితాంతం ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. కౌశల్ అమ్మ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన దీవించారు.

# ఎమ్మెల్యే యార్లగడ్డకు రాఖీలు కట్టిన నియోజకవర్గ మహిళలు.

- ఎమ్మెల్యే యార్లగడ్డ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు.
- తిలకం దిద్ది మిఠాయిలు తినిపించిన మహిళలు.
- రాఖీ సోదర--సోదరీమణుల అనుబంధానికి ప్రతీక యార్లగడ్డ.
- మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే.





**విజయవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 28:** విజయవాడ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు గన్నవరం నియోజకవర్గానికి చెందిన మహిళా సోదరమణిలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు నుదుటన తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించారు. అనంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదర, సోదరీమణుల ఆప్యాయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగ అని అన్నారు. ఇలాంటి పండుగలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే పి 4 లక్ష్యం



**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 28:** ఆర్థిక అసమానతలు తొలగించడం, పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పి4, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అమలు తీరు పై అన్ని జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, విజన్ యూనిట్ సభ్యులతో రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి వీడియో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం మెరుగుపడాలి, సంపద పెరిగితేనే పేదరికాన్ని నిర్మూలించగలమని చంద్రబాబు నాయుడు చెప్పారు. అప్పుడే రాష్ట్రం లోని ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ, సంక్షేమం అందరికీ అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. సమస్య పరిష్కారానికి అన్వేషణ ముఖ్యం, తద్వారా పరిష్కారంతోపాటు మెరుగైన సేవలు అందించగలమన్నారు. విజన్ 2047 లక్ష్యంతో స్వర్ణ నియోజకవర్గ విజన్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, విజన్ యూనిట్ సభ్యులు, అసోసియేట్ ప్రొఫెసర్లు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రభుత్వానికి, పరిపాలన వ్యవస్థకు మరింత గౌరవం లభిస్తుందన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండటానికి ఇదొక మార్గమని ఆయన సూచించారు. సృజనాత్మకతతో పనిచేసి, సంపద సృష్టిలో భాగస్వాములు కావాలని మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంలో ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యత కల్పించడం ద్వారా ఉత్పత్తులు పెరుగుతాయి. తక్కువ పెట్టుబడితో లాభసాటి వ్యవసాయంగా మారుతుందన్నారు. ప్రజల సానుకూల స్పందన స్థాయిని బాగా పెంచాలన్నారు. పోటీతత్వం, స్ఫూర్తిగా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన వివరించారు. భూమిని పచ్చగా ఉంచితే వాతావరణం మెరుగుపడుతుంది, అదే సమయంలో ఎల్ నినో నుంచి తప్పించుకోగలమన్నారు. ఆ దిశగా వినూత్న మైన ఆలోచనల వైపు అడుగులు వేయాలి, మీరంతా కలిసి పనిచేయాలని సూచనలు చేశారు. సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరం నుండి సిపిఓ రామారావు డిఆర్డిఏ పిడి సచిదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హోంమంత్రి నివాసంలో రాఖీ పండుగ

విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు రాఖీలు కట్టిన హోం మంత్రి



**నక్కపల్లి,పెన్ సత్తా,ఆగస్టు 28:** నక్కపల్లిలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నివాసంలో రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా నక్కపల్లిలో విధుల్లో ఉన్న పోలీసులకు శుక్రవారం హోం మంత్రి వంగలపూడి అనిత రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులకు స్వయంగా రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న పోలీసులు తమ కుటుంబాలకు,తమ సోదరీమణులకు దూరంగా ఉండడం వలన, రాఖీలు కట్టేందుకు అవకాశం లేకపోవడంతో తాను సోదరిగా భావించి పోలీసులకు రాఖీలు కట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి అక్కాచెల్లెమ్మ ఆనందంగా, సురక్షితంగా ఉండాలని హోం మంత్రి ఆకాంక్షించారు. ప్రతి పోలీసు కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పోలీసులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టిన వారిలో నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు, సిఐ జె.మురళి, ఎస్సై సన్నిబాబు, రామకృష్ణ మరికొంతమంది పోలీసులు ఉన్నారు.

## నక్కపల్లిలో రెండు కుటుంబాలను పరామర్శించిన రాజ్యసభ సభ్యులు బాబురావు






**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 28:**నక్కపల్లి మండలంలో ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఎంపీ గొల్ల బాబురావు పరామర్శించారు. రమణయ్యపేట మాజీ సర్పంచ్ కర్రీ శ్రీనివాస్ ఇటీవలనే సర్జరీ చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాసుని కలిసి పరామర్శించి యోక్షమాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే ఉద్దండపురం ఎంపీటీసీ బచ్చల రాజు తల్లి అనారోగ్యానికి గురై విశాఖపట్నంలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో మాట్లాడి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆమెకు సూచించారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు తో పాటు వైయస్సార్సీపి జిల్లా కార్యదర్శి శీరం నరసింహమూర్తి, లొడగల చంద్ర రావు, బిసి సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, మామిడి చంటి, రాజా రమేష్ తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసిన

మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం,ఆగస్టు 28 (పెన్ సత్తా)** పట్టణంలోని ఎర్రగుంటలో గల దేవి నర్సింగ్ హోమ్ హాస్పిటల్ అధినేతలు గాజుల నాగమోహన్, డాక్టర్ పద్మావతి కుమారుడు డాక్టర్ గాజుల అభిరాజ్, డాక్టర్ గాజుల మమత జాబిలి ఇటీవల వివాహ బంధంతో ఒకటయ్యారు.ఈ సందర్భంగా ధర్మవరం ఎమ్మెల్యే,మంత్రి సత్య కుమార్ యాదవ్ స్వయంగా వారి స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా సాగాలని ఆశీస్సులు అందజేశారు.

# నక్కపల్లి హోం మంత్రి నివాసంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం





- వ్రతానికి హాజరైన నాలుగు వేల మంది మహిళలు
- రాష్ట్ర ప్రజలందరిపై వరలక్ష్మీ దేవి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి
- పాయకరావుపేట నియోజకవర్గం మరింత అభివృద్ధికి కృషి
- గోదావరి జలాలు ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో ఉపయోగం హోం మంత్రి అనిత

**నక్కపల్లి, పెన్ సత్తా,ఆగస్టు 28:**నక్కపల్లి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో శుక్రవారం వరలక్ష్మీ దేవి వ్రతం అత్యంత వైభవంగా జరిగింది. పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 4 వేల మంది మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు.

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో సకుటుంబ సమేతంగా శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, వరలక్ష్మీ దేవి వ్రతాన్ని ఆచరించారు. ముత్తైదువులకు హోం మంత్రి అనిత వాయనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరిపై వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, రాష్ట్రం సుభిక్షంగా, సమృద్ధిగా ముందుకు సాగాలని వరలక్ష్మీ దేవిని కోరుకున్నట్లు చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని, ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి అనిత అన్నారు. ప్రతి ఒక్కరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం, పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి చెందాలని, అందరిపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని కోరుకున్నానన్నారు. తన కుటుంబంపై ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

రాబోయే రోజుల్లో పాయకరావుపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు రానున్నాయని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు రావడం ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో ప్రయోజనకరమని అన్నారు. పోలవరం ఒక కల అని, ఆ కల నేడు సాకారం కానుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని పూజా కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఇటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# ధర్మవరంలో గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి

- దుర్గా నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు తిమ్మాకుల తిరుపాల్ రెడ్డి గుండెపోటుతో మృతి
- తిరుపాల్ రెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల్లో విషాదం
- మృతుడికి భార్య లీలా రెడ్డి,కుమార్తెలు దివ్య,నవ్య
- జనసేన పార్టీలో పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న లీలా రెడ్డి
- తిరుపాల్ రెడ్డి మృతిపట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సంతాపం
- మృతుడి కుటుంబానికి పలువురు ప్రగాఢ సానుభూతి

**ధర్మవరం,ఆగస్టు 28 (పెన్ సత్తా)** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని దుర్గా నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు తిమ్మాకుల తిరుపాల్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల్లో విషాదం నెలకొంది.

మృతుడికి భార్య లీలా రెడ్డి,కుమార్తెలు దివ్య,నవ్య ఉన్నారు. లీలా రెడ్డి జనసేన పార్టీలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ కోసం తన వంతు కృషి చేస్తున్నారు. తిరుపాల్ రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# ధర్మవరం టిడిపి కార్యాలయంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



పరిటాల శ్రీరామ్ కు రాఖీ కట్టిన తెలుగు మహిళలు



అక్కా, చెల్లెమ్మల ఆప్యాయతను మర్చిపోలేనన్న.. శ్రీరామ్

**ధర్మవరం,ఆగస్టు 28 (పెన్ సత్తా)**ధర్మవరం నియోజకవర్గ అక్క, చెల్లెమ్మల ప్రేమ, ఆప్యాయతలను ఎప్పటికీ మర్చిపోలేనని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు.ధర్మవరం టీడీపీ కార్యాలయంలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పరిటాల శ్రీరామ్ కు తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు, పట్టణానికి చెందిన పలు వర్గాల మహిళలు రాఖీలు కట్టారు.మహిళలు పెద్ద ఎత్తున తరలి రావడంతో కార్యాలయంలో సందడి వాతావరణం కనిపించింది.శ్రీరామ్ ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ... తనకన్న చిన్న వయసు ఉన్న వారిని ఆశీర్వదించారు. తనకన్న పెద్ద వయసు ఉన్న వారు శ్రీరామ్ ను ఆశీర్వదించారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రతి అక్క, చెల్లెళ్లకు రక్షా బంధన్ సందర్భంగా శ్రీరామ్ శుభాకాంక్షలు తెలియజేశారు.అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ వేళ ఇంత మంది మహిళల ప్రేమను చూడటం ఆనందంగా ఉందన్నారు. ధర్మవరం పట్టణంలో మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని శ్రీరామ్ తెలిపారు.

# రూ.3 కోట్లతో ఏటికొప్పాక హస్తకళల థీమ్ పార్క్.



వైభవంగా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్.

**యలమంచిలి ఐఆగస్టు 28 (పెన్ సత్తా)**ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక లక్క బొమ్మల కళకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు యలమంచిలి మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'హస్తకళ ఇతివృత్త ఉద్యానవనానికి' (థీమ్ పార్క్) శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించామని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సంయుక్తంగా ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ?అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక హస్తకళాకారుల తయారీ కేంద్రాలను సందర్శించారు. సహజ రంగుల వినియోగం, సంప్రదాయ లక్క బొమ్మల తయారీ విధానాలను ఎమ్మెల్యే ఆరా తీశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ... ఏటికొప్పాక లక్క బొమ్మలకు పద్మశ్రీ, జాతీయ అవార్డులు రావడం రాష్ట్రానికే గర్వకారణమని, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించడమే ఈ కళ ప్రత్యేకత అని కొనియాడారు. గ్రామంలో సుమారు 10 ఎకరాల స్థలంలో రూ.3 కోట్లతో ఈ పార్కును శంకుస్థాపన చేయడం శుభపరిణామన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా, హస్తకళా హబ్‌గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాకారుల జీవనోపాధి, మార్కెటింగ్ సౌకర్యాలతో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే లెఫ్ట్ కెనాల్‌లో బోటింగ్, రిసార్ట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ?ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కళాకారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చైనాలో భూకంపం

చైనాలోని సిచువాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో పొరుగున ఉన్న నేపాల్‌కు శుక్రవారం మరో వరద హెచ్చరిక జారీ అయింది. భూకంప దాటికి చైనా, నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆనకట్ట తెగిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, ఎగువ నుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం నది నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉన్నందున, నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతమైన త్రిశూలి ప్రాంతాన్ని మరోసారి ఖాళీ చేయిస్తున్నట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం సంభవించిన ఈ భూకంపం భూమికి 13 కి.మీ. లోతులో సంభవించినట్లు తెలుస్తోంది. పైనుంచి బురదతో కూడిన నీటి ప్రవాహం వేగంగా వస్తుండటంతో, నేపాల్‌లోని త్రిశూలి పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని నేపాల్ పోలీసులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా, చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని లాంగ్‌చాంగ్ నగరాన్ని భూకంపం కుదిపేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ తెలిపినట్లు నివేదించింది.

మరోవైపు, నేపాల్‌లో వరద వల్ల నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. కాబట్టి సహాయక చర్యల్లో పాల్గొన్న వాహనాలను వెనక్కి తిరిగివస్తున్నాయని చెప్పారు. నేపాల్?కు మరో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. పైనుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం వల్ల నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలో ప్రజలను మరోసారి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. అలాగే, నేపాల్- చైనా సరిహద్దు సమీపంలో భోటే కోషి నది దిగువన ఉన్న ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని నేపాల్ జలవిజ్ఞాన, వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ సరస్సులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆనకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు తెలియజేశారు.

**ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలు**



మరోవైపు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ నేపాల్ సైన్యం సహాయక చర్యలను కొనసాగిస్తోందని ప్రతిపక్ష నాయకుడు భీష్మరాజ్ పేర్కొన్నారు. త్రిశూలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సైన్యం, హెలికాప్టర్ బృందం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఈ ఆపరేషన్‌లో రెండు సైనిక హెలికాప్టర్‌లతో పాటు, ఇతర ప్రైవేటు రంగానికి చెందిన మరికొన్నింటిని రంగంలోకి దించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ అధికారి మీడియాతో మాట్లాడారు. తాము కాఠ్మండు నుంచి వచ్చామని, ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వం, నేపాల్ ప్రభుత్వం రెండూ కలిసి శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

**పెరుగుతున్న మృతుల సంఖ్య**

నేపాల్‌లోని రసువా జిల్లాలో సంభవించిన వినాశకరమైన ఆకస్మిక వరదల కారణంగా మృతుల సంఖ్య శుక్రవారం నాటికి 469కి చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుమారు 1,545 మంది గాయపడ్డారని నేపాల్ పోలీసులు తెలిపారు. అత్యధికంగా చిత్వాన్ జిల్లాలో 178 మృతదేహాలు లభ్యమయ్యాయని, ఆ తర్వాత ఎన్‌పీ ఈస్ట్‌లో 110, గోర్ఖాలో 44, నువాకోట్‌లో 37, ధాడింగ్‌లో 33, తనాహున్‌లో 28, ఎన్‌పీ వెస్ట్‌లో 27, రసువాలో 12 మృతదేహాలు దొరికాయని చెప్పారు. వరద బురదలో చిక్కుకుపోయిన తర్వాత బయటపడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, ఒక స్థానికుడు ఇలా అన్నారు. "మేం చాలా బురదలో చిక్కుకుపోయాము. మా ఇళ్లు, దుకాణాలు, సామాన్లను అన్నింటిని కోల్పోయాం. మేం మా పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో మొదట భూమి కదలడం గమనించాం. కానీ, అది సాధారణమేనని భావించాం. కానీ త్రిశూలి, ధోబీ వాగుల నుంచి నీరు 50 అడుగుల ఎత్తున ఉప్పొంగడం చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యాం. అందులో పడి చాలా మంది కొట్టుకుపోయారు. త్రిశూలి మార్కెట్ ప్రాంతంలో ఒక్క మనిషి కూడా మిగల్లేదు. మేము ఎలాగోలా తప్పించుకోగలిగాము" అని ఆందోళన వ్యక్తం చేశారు.

## నేపాల్‌లో 579 మంది మృతి..



**నేపాల్ :** నేపాల్ వరదల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను రెస్క్యూ బృందాలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 579 మృతదేహాలు వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఈ విపత్తులో ఇప్పటివరకు 1473 మంది గాయాలపాలైనట్లు పేర్కొన్నారు.

**320 మంది భారతీయులు గల్లంతు..**

మరోవైపు, నేపాల్‌లో 320 మంది భారతీయల ఆచూకీ ఇంకా తెలియలేదని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. చైనా వైపు 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని, వారిలో 96 మంది రోడ్డు మార్గంలో సురక్షితంగా నేపాల్‌లోకి ప్రవేశించారని పేర్కొంది. మరో 21 మంది కాఠ్‌మాండూ నుంచి దిల్లీకి చేరుకున్నారని తెలిపింది.

**కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు..**

నదీ పరివాహక ప్రాంతంలో మృతదేహాలను వెలికితీసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలో నాలుగు, కుషీనగర్ జిల్లాలో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు వెల్లడించారు. ఇవి నేపాల్ నుంచి కొట్టుకువచ్చినట్లు భావిస్తున్నామని మహారాజ్‌గంజ్ జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ సింగ్ సోగార్వాల్ తెలిపారు. ఈ మృతదేహాలు ఎవరివనే విషయం ఇంకా నిర్ధరణ కాలేదని, ఇదే విషయంపై నేపాల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు.

**చైనా వైపు 558 మంది..**

టిబెట్‌లోని చైనా-నేపాల్ సరిహద్దులో ఉన్న గీరోంగ్ కౌంటీలో సంభవించిన ఆకస్మిక వరదల్లో 558 మంది గల్లంతైనట్లు చైనా వెల్లడించింది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. గల్లంతైన వారిలో 260 మంది విదేశీయులే ఉన్నారని పేర్కొన్నప్పటికీ వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇదిలా ఉంటే, టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించింది.

## 1.77 అంగుళాలు వంగిన భాక్రా నంగల్ డ్యామ్ గోడ - క్లారిటీ ఇచ్చిన కేంద్రం



పంజాబ్‌లోని భాక్రా నంగల్ డ్యామ్ గోడ 1.77 అంగుళాలు వంగిందని సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. ఒకవేళ డ్యామ్ తెగిపోతే దిల్లీ సహా పలు నగరాలు మునిగిపోతాయనే భయాలు ఈ వీడియో వల్ల రేకెత్తాయి. అయితే ఈ విషయంపై ప్రభుత్వ అధికారిక నిజ నిర్ధరణ విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) కీలక ప్రకటన చేసింది. ఈ వాదనను పూర్తిగా తప్పుదోవ పట్టించేదిగా, అవాస్తవమైనదిగా పేర్కొంది. 2026 ఆగస్టు 27న భాక్రా నంగల్ డ్యామ్ గోడలో నమోదైన అసలు కదలిక కేవలం 0.86 అంగుళాలు మాత్రమేనని పీఐబీ స్పష్టం చేసింది. ఇది ఇంజినీరింగ్ భద్రతా ప్రమాణాల ప్రకారం నిర్దేశించిన సాధారణ పరిధిలోనే ఉందని వెల్లడించింది.

**వదంతులను, తప్పుడు వార్తలను నమ్మొద్దు!**

మరోవైపు, భాక్రా నంగల్ డ్యామ్ నిర్మాణాత్మకంగా పటిష్టంగానే ఉందని అధికారులు, నిపుణులు తెలిపారు. దాని స్థిరత్వానికి ఎలాంటి ముప్పు లేదని ధ్రువీకరించారు. ఈ ఆనకట్టను ప్రపంచంలోనే అత్యంత ప్రధానమైన డ్యామ్‌ల్లో ఒకటిగా పరిగణిస్తారని వెల్లడించారు. ఒత్తిడి, రంధ్ర పీడనం, లీకేజీ వంటి కీలక నిర్మాణ భద్రతా సూచికలు నిర్దేశించిన సురక్షిత పరిమితుల్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. కాగా, భాక్రా నంగల్ డ్యామ్ భద్రతపై సోషల్ మీడియాలో ప్రచారంలో అవుతున్న వీడియోలను, భయాందోళనలు సృష్టించే వదంతులను నమ్మొద్దని పీఐబీ, పంజాబ్ ప్రభుత్వం ప్రజలను కోరాయి. భాక్రా నంగల్ ఆనకట్ట భద్రతకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక, ధ్రువీకరించిన మూలాల నుంచి వచ్చిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేశాయి. పీఐబీ, అధికారులు ప్రకటనతో భాక్రా నంగల్ డ్యామ్ గోడ వంగిందన్న దుష్ప్రచారానికి తెరపడింది.

**కొన్నాళ్ల క్రితం మంత్రి ప్రకటన**

కొద్ది రోజుల క్రితం పంజాబ్ జలవనరుల శాఖ మంత్రి బరీందర్ కుమార్ గోయల్ కూడా రాష్ట్ర అసెంబ్లీలో భాక్రా నంగల్ డ్యామ్ గురించి ప్రసంగించారు. ఈ క్రమంలో ఆనకట్ట భద్రతపై ఉన్న ఆందోళనలను తగ్గించేందుకు ప్రయత్నించారు. భాక్రా నంగల్ డ్యామ్ గోడలో తాత్కాలిక కదలిక, దాని ఇంజినీరింగ్ డిజైన్‌లో ఒక సాధారణ భాగమని గోయల్ అన్నారు. నీటి ఒత్తిడి పెరిగినప్పుడు స్వల్ప కదలిక సంభవించవచ్చని, ఒత్తిడి తగ్గినప్పుడు నిర్మాణం తిరిగి యథాస్థితికి వస్తుందని తెలిపారు. గత 40 ఏళ్లలో భాక్రా నంగల్ డ్యామ్ గోడలో ఇలాంటి కదలికలు 15 సార్లు నమోదయ్యాయని వివరించారు. అందుకే ఈ విషయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భాక్రా నంగల్ ఆనకట్ట సురక్షితంగానే ఉందని చెప్పారు.

**పంజాబ్ సర్కార్‌కు హరియాణా ప్రభుత్వం విజ్ఞప్తి**

ఇటీవలే పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా సర్కార్ కోరింది. లేకపోతే ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని అభిప్రాయపడింది. దిల్లీలో ఆప్ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని పేర్కొంది. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదని వెల్లడించింది. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా పంజాబ్ ప్రభుత్వం వ్యవహరించకూడదని కోరింది. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే రాలేదని స్పష్టం చేసింది. భాక్రా నంగల్ ఆనకట్ట నిర్మాణం 1948వ సంవత్సరంలో మొదలై 1963లో పూర్తైంది. దీని ఎత్తు 741 అడుగులు (226 మీటర్లు). ఈ డ్యామ్ ఇంచుమించు 10 మిలియన్ ఎకరాలకు పంట నీరును అందిస్తుంది. ఈ డ్యామ్‌ను ఉత్తర భారతదేశంలోని పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ సరిహద్దులలో నిర్మించారు. ఈ డ్యామ్ నిర్మాణానికి ముఖ్య కారణం సట్లెజ్-బియాస్ నదీ పరీవాహక ప్రాంతంలో వరదలను నిరోధించడం, పంట పొలాలకు సాగునీటి పంపిణీ, జల విద్యుత్తు (హైడ్రో విద్యుత్) ను ఉత్పత్తి చేయడం. ప్రస్తుతం భాక్రా నంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# శాంతియుత పరిష్కారానికి ఇరుదేశాలు అంగీకారం

భారత్, చైనా మధ్య జరుగుతున్న సరిహద్దు చర్చలు(ఎర్లీ హార్వెస్ట్) గురించి భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం కీలక విషయాలు వెల్లడించారు. ఈ చర్చల ద్వారా ఇరుదేశాలు సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా, ఇరుపక్షాలకు ఆమోద యోగ్యమైన, సహేతుకమైన, న్యాయమైన రీతిలో పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2005లో ఏర్పరుచుకున్న మార్గదర్శకాలు, నియమ, నిబంధల ప్రకారమే, ఈ చర్చలు ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో వీలైనంత త్వరగా మంచి ఫలితాలు సాధించాలని ఇరుదేశాలు నిర్ణయించాయని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇందుకోసం ఔవీజజ (సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెజానిజం) పరిధిలోని సరిహద్దు గుర్తింపు నిపుణుల కమిటీ తన చర్చలు మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీని ద్వారా సరిహద్దు గుర్తింపు ప్రక్రియలో వీలైనంత త్వరగా సానుకూల ఫలితాలు సాధించేలా ఇరుదేశాలు ముందడుగు వేయనున్నాయని ఆయన వెల్లడించారు.

**నేపాల్‌లోని భారత పర్యటకుల పరిస్థితి ఏంటి?**

మరోవైపు నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షితంగా బయటపడిన భారత పర్యటకులను, ఆ దేశంలోని భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ త్రిభువన్ శుక్రవారం కలుసుకున్నారు. కాఠ్?మండు నుంచి ఇండిగో విమానంలో భారత్‌కు తిరుగు ప్రయాణమైన భారతీయ పౌరులకు ఆయన వీడ్కోలు పలికారు. ఈ విషయాన్ని నేపాల్?లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. నేపాల్?లోని రుసువా, ధాడింగ్, నువాకోట్? సహా ఇతర ప్రాంతాల్లో భారీ ఆకస్మిక వరదల వల్ల వందలాది మంది మరణించగా, మరెందరూ గల్లంతయ్యారు. ఇళ్లు, వంతెనలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు, రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. అయితే వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 85 మంది భారతీయులతో సహా కనీసం 121 మంది విదేశీ పర్యటకులను భద్రతా దళాలు రక్షించినట్లు నేపాల్ టూరిజం బోర్డు శుక్రవారం తెలిపింది. నేపాల్ టూరిజం బోర్డు ఇచ్చిన సమాచారం ప్రకారం, భద్రతా దళాలు కాపాడిన పర్యటకులలో 9 మంది దక్షిణ కొరియా పౌరులు, 16 మంది చైనా పౌరులు కూడా ఉన్నారు. శుక్రవారం నాటికి ఉన్న సమాచారం ప్రకారం, నేపాల్ వరదల్లో చిక్కుకుని మరణించిన వారి సంఖ్య 538కి పెరిగింది. మరోవైపు ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో 2.391 మంది నేపాల్ ఆర్మీ సిబ్బందితో పాటు, మొత్తం 7,451 మంది భద్రతా సిబ్బందిని నేపాల్ రంగంలోకి దింపింది.



**మరోసారి ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం?**

నేపాల్?ను ఇప్పటికే ఆకస్మిక వరదలు అతలాకుతలం చేయగా, నీటి మట్టాలు పెరగడం వల్ల మరోసారి వరదలు వచ్చే ప్రమాదం ఉందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్?డీఆర్?ఆర్?ఎంఏ) శుక్రవారం వెల్లడించింది. అందువల్ల భోటెకోశి, త్రిశూలి ప్రాంతాల్లోని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

**భారత్‌లోకి కొట్టుకువస్తున్న మృతదేహాలు**

మరోవైపు నేపాల్‌ను ముంచెత్తిన వరదలు వల్ల మరణించిన వారి మృతదేహాలు ఇప్పుడు మన దేశంలోని నదుల్లోకి కొట్టుకొస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్, బిహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజ్ వద్ద ఇప్పటివరకు 5 మృతదేహాలు లభ్యమయ్యాయి. ముఖ్యంగా యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లా పరిధిలో గండక్ నదిలో నాలుగు గుర్తుతెలియని మృతదేహాలను సశస్త్ర సీమా బల్ బలగాలు వెలికితీశాయి. అవి తీవ్రంగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయని, వాటిని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించామని అధికారులు తెలిపారు. అటు బిహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజ్ వద్ద కూడా మరో మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాలు నేపాల్ వరదల్లో గల్లంతైన వారివేనా లేదా అనేది నిర్ధరించేందుకు ఆ దేశ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత అధికారులు వెల్లడించారు.

## సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత

వరదలతో అతలాకుతలమైన పొరుగుదేశం నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత పరిస్థితులపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్షించారు. నేపాల్‌లో సహాయక చర్యలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు నేపాల్ మంత్రులు తమ నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాఠ్‌మాండూ, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నట్లు జైశంకర్ తెలిపారు. నేపాల్‌లో ఉన్న భారతీయుల క్షేమం, ప్రస్తుత పరిస్థితిపై తాజా సమాచారం సేకరించినట్లు పేర్కొన్నారు. నేపాల్‌కు మరింత సహాయ సామగ్రి పంపే అంశంపైనా విదేశాంగ శాఖలోని సంబంధిత విభాగాలతో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ఇప్పటికే భారత్ సహాయ చర్యల్లో భాగస్వామ్యం కాగా, అవసరమైన మరిన్ని వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా, ఆయన మంత్రివర్గ సహచరులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ఒక నెల జీతాన్ని ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. రసువా జిల్లాలోని భోటే కోశీ ప్రాంతంలో వరదల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలు, పునరావాసం, పునర్నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. వరదలతో నష్టపోయిన వ్యక్తులు, వ్యాపార సంస్థలకు ప్రత్యేక సహాయ, పునరావాస ప్యాకేజీ సిద్ధం చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ఇబ్బందులు తలెత్తకుండా నేపాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులను ప్రభుత్వాల మధ్య ఒప్పందం (+2+) విధానంలో కొనుగోలు చేసేందుకు కృషి సామగ్రి కంపెనీ లిమిటెడ్‌కు సూత్రప్రాయ అనుమతి ఇచ్చింది. వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినడం, పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడటంతో ఎరువుల సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

**జిన్‌పింగ్ అధ్యక్షతన అత్యవసర సమీక్ష**

నేపాల్-టిబెట్? సరిహద్దు వరదలపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, సహాయక, గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విపత్తులో మృతిచెందిన వారికి సంతాపంగా సమావేశంలో జీ జిన్‌పింగ్, ఇతర నేతలు కొద్దిసేపు మౌనం పాటించారు. గల్లంతైన చైనా, విదేశీ పౌరులందరినీ గుర్తించి రక్షించేందుకు శాస్త్రీయంగా గాలింపు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**భారత్-నేపాల్ వాణిజ్యానికి వరద దెబ్బ**

వరదల ప్రభావం భారత్-నేపాల్ సరిహద్దు వాణిజ్యంపైనా పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సోనౌలి సరిహద్దు వద్ద నేపాల్‌లోకి వెళ్లాల్సిన సరకు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. భారత వైపు సుమారు 16 కిలోమీటర్ల మేర ట్రక్కుల క్యూ ఏర్పడింది. కాఠ్?మాండూ సహా నేపాల్‌లోని వివిధ ప్రాంతాలకు సరుకులు తీసుకెళ్లే వాహనాలు రహదారులు దెబ్బతినడంతో ముందుకు కదలలేకపోతున్నాయి. రాకపోకలు ఆలస్యమైతే ఇరు దేశాల మధ్య సరకు సరఫరాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు.

# బిజినెస్

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

## సెన్సెక్స్ 330 పాయింట్లు లాభం



భారత స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాల్లో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 84 పాయింట్లు లాభపడింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 245.56 పాయింట్ల లాభంతో 77,191.80 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. నిఫ్టీ కూడా 54.20 పాయింట్ల లాభంతో 24,147.50 వద్ద ప్రారంభమైంది. రోజంతా 76,988.22 నుంచి 77,357.97 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు సెన్సెక్స్ 330.92 పాయింట్లు (0.43%) లాభంతో 77,264.51 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 84.80 పాయింట్లు (0.43%) లాభంతో 24,175.65 వద్ద ముగిసింది. ఐటీ స్టాక్స్ శుక్రవారం భారీ లాభాల్లో కొనసాగాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.51 % లాభపడింది. టీసీఎస్ 4.09 %, ఇన్ఫోసిస్ 3.34%, టెక్ మహీంద్రా 3.18%, హెచ్‌సీఎల్ టెక్ అడ్వాన్సింగ్ 2.68%, టైటాన్ 1.17%, ఎటర్నల్ 1.16%, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులు 1.12% లాభపడ్డాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతి సుజుకీ, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 88.30 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4603 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ఓలా నుంచి కొత్త స్కూటర్..

## సింగిల్ ఛార్జ్‌తో 301ఎం



దిల్లీ: ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ దేశీయ విపణిలోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1జడ్ మోడల్‌ను లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇందులో వినియోగించారు. దీన్ని ఓలా తన గిగా ఫ్యాక్టరీలో తయారు చేసింది. తక్కువ ధరలో, అధిక రేంజ్ స్కూటర్‌ను అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ స్కూటర్ రెండు వేరియంట్లలో లభ్యమవుతుంది. 3.1కెడబ్ల్యూహెచ్, 5.1కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌లతో లభిస్తుంది. చిన్న బ్యాటరీ వేరియంట్ ధర రూ.79,999 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 179 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. ఇక 5.1కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్ రూ.99,999కి లభ్యమవుతుంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 301 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ పేర్కొంది. మొత్తం నాలుగు రంగుల్లో లభిస్తుంది. భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇన్‌హౌస్‌లో అభివృద్ధి చేయడం ద్వారా బ్యాటరీ ఖర్చును గణనీయంగా తగ్గించగలిగామని ఓలా పేర్కొంది. అలాగని, ఇతర అంశాల్లో రాజీ పడకుండా తక్కువ ధరలో ఎస్1జడ్‌ను తీసుకొచ్చినట్లు తెలిపింది. 3.1కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్ కలిగిన స్కూటర్లను ఈ ఏడాది డిసెంబర్ నుంచి, పెద్ద బ్యాటరీ కలిగిన స్కూటర్లను వచ్చే ఏడాది మార్చి నుంచి డెలివరీ చేస్తామని తెలిపింది. మూవ్ ఓఎస్ 5తో ఈ స్కూటర్ పనిచేస్తుంది. క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ మోడ్, జీపీఎస్, ఓటీఏ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, జియో, ట్రైమ్, మోడ్ ఫెన్సింగ్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నట్లు ఓలా పేర్కొంది.

# పండుగ సీజన్‌లో చక్కెర ధర పైపైకి..

## క్విక్ కామర్స్ యాప్‌లలో చక్కెర కొనుగోలుపై పరిమితులు!



**న్యూఢిల్లీ :** విపరీతంగా పెరుగుతున్న చక్కెర ధరలు రానున్న పండుగ సీజన్‌లో ప్రజలకు తీపిని దూరం చేయనున్నాయి. పండుగలు సమీపిస్తుండటంతో ప్రజలు స్వీట్లు, ఇతర సాంప్రదాయ వంటకాల కోసం చక్కెరను నిల్వ చేసుకుంటుండంతో దాని డిమాండ్ పెరగనున్నది. అయితే ఒకవైపు చక్కెర కోసం అధిక ధరను చెల్లిస్తున్న వినియోగదారులు మరోవైపు ఫాస్ట్-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, ఆఫ్‌లైన్ రిటైలర్లు చక్కెర కొనుగోళ్లపై పరిమితులు విధించడంతో కొరతను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతున్నది. జెప్టో, బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లు కొన్ని చక్కెర ఉత్పత్తులపై పరిమాణ పరిమితులను విధించినట్టు తెలుస్తున్నది. ఉత్పత్తులు, ప్లాట్‌ఫారాలను బట్టి ఈ పరిమితులు మారుతున్నాయి. చక్కెర వినియోగం పెరుగుతుందని భావిస్తున్న తరుణంలోనే దాని ధరలు భారీగా పెరిగి వినియోగదారులు, చిల్లర వ్యాపారులపై ఒత్తిడిని పెంచుతుండటంతో ఈ పరిమితులు విధించినట్టు తెలుస్తున్నది. కొనుగోలుపై ఉన్న ఆంక్షలు భౌతిక రిటైల్ రంగానికి కూడా విస్తరించాయి. డిమార్ట్, రిలయన్స్ వంటి పెద్ద ఆఫ్‌లైన్ రిటైల్ చైన్‌లకు చెందిన కొన్ని స్టోర్లలో ఒక్కో కస్టమర్‌కు చక్కెర కొనుగోళ్లను సుమారు 2-3 కిలోలకు పరిమితం చేశాయి.

**ప్రభుత్వ చర్యలు**

చక్కెర ధరల పెరుగుదల నేపథ్యంలో సరఫరాను మెరుగుపరచడానికి, నిల్వలను అక్రమంగా దాచి ఉంచడాన్ని నివారించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దిగుమతి చేసుకున్న ముడి చక్కెరను శుద్ధి చేసిన చక్కెరగా మార్చి, దేశీయ మార్కెట్లో విక్రయించడానికి దిగుమతిదారులకు మరింత సమయం ఇస్తూ ప్రభుత్వం ముడి చక్కెరపై సుంకం లేని దిగుమతులకు సంబంధించిన నిబంధనలను సవరించింది. ఈనెల 20న జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు టారిఫ్-రేట్-కోటా కింద 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. ధరలపై ఒత్తిడి ఉన్న తరుణంలో దేశీయ మార్కెట్లోకి అదనపు చక్కెరను తీసుకురావడమే సుంకం లేని దిగుమతి వెసులుబాటు లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**36,000 కోట్ల చక్కెర కుంభకోణం: విపక్షాలు**

పండుగ సీజన్‌లో చక్కెర ధరలు పెరుగడం వల్ల నిల్వదారులు, బ్లాక్‌మార్కెటర్లకు లబ్ధి చేకూర్చేలా రూ.36,000 కోట్ల చక్కెర కుంభకోణానికి మోదీ ప్రభుత్వం సహకరించిందని విపక్షాలు గురువారం ఆరోపించాయి. చక్కెర కొరత గురించి ఏప్రిల్ నెలలోనే ప్రభుత్వానికి తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండిపోవడం వల్లే చక్కెర ధరలు కిలోరూ రూ.40 నుంచి రూ.75కు పెరిగాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఆగస్టు, నవంబర్ మధ్య దేశంలో సుమారు 1.20 కోట్ల టన్నుల చక్కెర వినియోగం ఉంటుందని అంచనా అని, ఈ పరిస్థితుల్లో ప్రజలు కిలోకు కనీసం అదనంగా రూ.30 చెల్లించాల్సి వస్తుందని విపక్షాలు పేర్కొన్నాయి

# త్వరలో జియో ఐపీఓ.. సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్




**దిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగం జియోప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపీఓకు సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి కంపెనీ అనుమతి పొందింది. సుమారు 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.37,700 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది. దీంతో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా జియో రికార్డు సృష్టించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ జూన్‌లోనే ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కోసం మార్కెట్ నియంత్రణ సంస్థకు ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఆగస్టు 28న సెబీ తుది పరిశీలన పొందింది. పబ్లిక్ ఇష్యూకు సెబీ పచ్చజెండా ఊపిన నేపథ్యంలో నియంత్రణ సంస్థల నిబంధనలకు లోబడి నిధులు సమీకరణకు సన్నాహాలు ప్రారంభించొచ్చు. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఞఎౚా) ప్రకారం.. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. మొత్తం ఈక్విటీలో 2.9 శాతం మేర వాటాను తగ్గించుకోనుంది. కొన్నేళ్లుగా జియో ఐపీఓ కోసం మదుపర్లు, మార్కెట్ విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కంపెనీ 137 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ వద్ద సుమారు రూ.37,700 కోట్లు సమీకరించొచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఐపీఓ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ పేరిట రూ.27వేల కోట్ల ఐపీఓ రికార్డు ఉంది. త్వరలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ కూడా మెగా ఐపీఓకు సన్నద్ధమవుతోంది. సుమారు రూ.30వేల కోట్లు సమీకరించనుంది. జియోలో 2020లో మెటా రూ.43,574 కోట్లు (9.99 శాతం వాటా), గూగుల్ రూ.33,737 కోట్లు (7.73 శాతం వాటా) పెట్టుబడిగా పెట్టాయి. వ్యూహాత్మక పెట్టుబడిదారుల నుంచి మరో రూ.74,745 కోట్లు జియో సమీకరించింది.

# అదే కొలంబో టెస్టులో కోహ్లీ ఉండుంటే..

# ఫలితం మరోలా..: మహ్మద్ కైఫ్



**ఇంటర్నెట్ డెస్క్:** ఒక్క రోజులో నాలుగు వికెట్లను తీయలేక ఇబ్బంది పడిన భారత బౌలర్లు శ్రీలంకతో (×చీణ జం ూా) రెండో టెస్టును డ్రా చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో పర్సంటేజీ కూడా తగ్గిపోయింది. ప్రత్యర్థికి ఫాలో ఆన్ ఇచ్చినా గిల్ సరైన వ్యూహాలను అమలు చేయలేదని విమర్శలు వచ్చాయి. లంక బ్యాటర్ సోనాల్ దినుషను అడ్డుకోవడంలో టీమ్‌ఇండియా విఫలమైందని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఆక్షేపించాడు. అదే విరాట్ కోహ్లీ అక్కడుంటే పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించాడు.

**మహిళల క్రికెట్‌లో అనయ బంగర్‌ను ఎలా ఆడిస్తారు?: కాప్ తీవ్ర అభ్యంతరం**

"టెస్టు క్రికెట్ ఆడటం అందరికీ సూట్ కాదు బాస్.. ఇది సుదీర్ఘమైన ఫార్మాట్ గేమ్. బౌలింగ్ ఎటాక్‌ను కొనసాగిస్తూనే ఉండాలి. ఎందుకో.. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడుంటే తప్పకుండా భారత్ విజయం సాధించేదేమో అనిపించింది. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జట్టు సహచరుల్లో ఉత్సాహాన్ని నింపుతాడు. ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఉంటే చాలు ఫలితం దక్కుతుందని.. బంతి బాగా తిరుగుతుంది కాబట్టి వికెట్ వస్తుందనుకొని తేలిగ్గా తీసుకున్నట్టుగా అనిపిస్తోంది. మన ఎనర్జీ లెవల్స్ తగ్గుతున్నప్పుడు విరాట్ (ఎఱతీష్ ఖశీష్ట్రశీఱ) ఉండుంటే.. ప్రతి ఒక్కరినీ ఉత్సాహపరిచేవాడు. ప్రత్యర్థులపై మాటలతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోన్న సర్ఫరాజ్, యశస్వి జైస్వాల్‌ను ఇంకా ప్రోత్సహించేవాడు. సోనాల్‌నూ కోహ్లీ వెంటాడేవాడు. కానీ, ఈ జట్టులోని ఆటగాళ్లు మాత్రం కుమార వంటి లోయర్ ఆర్డర్ బ్యాటర్‌ను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం చూశాం" అని కైఫ్ అన్నాడు.

**ఒత్తిడి పడలేదు..**

"ఈ మ్యాచ్‌లో సోనాల్‌నే (రాశీఱఖశ్రీ ణఱఅబంష్టుు) ఔట్ చేయాలి. అతడు చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. లాహిరు కుమారతో తమ భాషలో 'వాళ్ల ముఖాలు చూడు' అని భారత ప్లేయర్లను అంటున్నట్లుగా ఓ వీడియో చూశా. ఓ వైపు టెయిలెండర్లు మాత్రమే ఉన్నా.. సోనాల్ మాత్రం ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కనిపించాడు. మనవాళ్ల స్లెడ్జింగ్ అసలు అతడిపైనే జరిగినట్లు అనిపించలేదు. ఎంతసేపూ కుమార, ప్రభాత్ జయసూర్యనే లక్ష్యం చేసుకోవడం కనిపించింది. అలాగే, పెద్ద ప్లేయర్ అతడికి దగ్గరగా తిరుగుతూ మానసికంగానూ ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు. మొన్నటి వరకూ విరాట్ కోహ్లీ, రోహిత్, అశ్విన్, ధోని.. ఇలాంటి ప్లేయర్లను దగ్గరగా చూస్తే ప్రత్యర్థి కుర్రాళ్లు కాస్త కంగారు పడేవారు. ఒత్తిడి పెంచుకొనేవాళ్లు. ఎందుకో.. ఈసారి అలాంటి పరిస్థితిని మనం కోల్పోయామని అనిపించింది" అని కైఫ్ వెల్లడించాడు.

# స్పోర్ట్స్

## నిప్పులు చెరిగిన ఆర్చర్, రాబిన్సన్..

## లార్డ్స్ టెస్టులో

## 110కే పాకిస్థాన్ ఆలౌట్..!



లార్డ్స్‌లో జరుగుతున్న రెండో టెస్టులోనూ పాకిస్థాన్ బ్యాటర్లు తేలిపోయారు. ఇంగ్లండ్ పేసర్లు ఓలీ రాబిన్సన్(4-11), జోఫ్రా ఆర్చర్(3-26)లు నిప్పులు చెరగడంతో రెండో రోజు పాక్ ఆటగాళ్లు క్రీజులో నిలవలేకపోయారు. ఓపెనర్ అజాన్ అవైస్(46)కు సహకరించే వాళ్లు కరువయ్యారు. చివరి బ్యాటర్ అబ్బాస్(3)ను ఆర్చర్ ఔట్ చేయడంతో 110 పరుగలకే ఆ జట్టు ఆలౌటైంది. వెంటనే అంపైర్లు టీ బ్రేక్ ప్రటించగా.. సమిష్టి వైఫల్యం కారణంగా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు వెనుకంజలో ఉంది పాక్. తొలి టెస్టులో భారీ విజయంతో జోరుమీదున్న ఇంగ్లండ్ లార్డ్స్‌లోనూ పట్టుబిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 290కే ఆలౌటైన ఆతిథ్య జట్టుకు బౌలర్లు మంచి ఆధిక్యాన్ని అందించారు. దాంతో, ఆతిథ్య జట్టును మూడొందలలోపే కట్టడి చేశామని సంబురపడిన పాక్ సంతోషం ఆవిరైంది. ఓపెనర్ షాన్ మసూద్(1) వికెట్‌తో ఇంగ్లండ్‌కు జోఫ్రా ఆర్చర్(3-26) తొలి బ్రేకివ్వగా.. ఆపై ఓలీ రాబిన్సన్(4-11) వికెట్ల వేటతో భయపెట్టాడు. మరో ఎండ్‌లో జోష్ టంగ్(2-27) సైతం విజృంభించి ఫామ్‌లోలేని బాబర్ ఆజాం(8)ను వెనక్కి పంపాడు. అంతే.. 30 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. కష్టాల్లో పడిన పాక్‌ను రాబిన్సన్, ఆర్చర్ మరింత దెబ్బతీయగా.. తర్వాతి ఆటగాళ్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఓపెనర్ అజాన్ అవైస్(46) మినహా క్రీజునంటుకొని పోరాడే బ్యాటర్ కరువవ్వడంతో పాక్ ఇన్నింగ్స్ 110 వద్ద ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 180 పరుగులు వెనకబడింది. పాక్ కుప్పకూలడంతో ఇంగ్లండ్ టీ బ్రేక్ అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలెట్టనుంది.

# భారత్‌కు 8వ స్థానం



**వెవ్రె (బెల్జియం) :** హాకీ ప్రపంచకప్‌లో సెమీస్ చేరడంలో విఫలమైన భారత హాకీ జట్టు వర్గీకరణ మ్యాచ్‌లో పోరాడి ఓడింది. ఏడో స్థానం కోసం జరిగిన పోరులో భారత్.. బెల్జియం చేతిలో ఓడి 8వ స్థానంతో టోర్నీని ముగించింది. పెనాల్టీ షూటౌట్ ద్వారా ఫలితం తేలిన మ్యాచ్‌లో భారత్.. 3-4 (3-3)తో బెల్జియంకు తలొంచింది. తొలి క్వార్టర్ ఆరో నిమిషంలోనే అభిషేక్ గోల్ బోణీ కొట్టినా రెండో క్వార్టర్‌లో బెల్జియం తరఫున రొమెన్ దువెకొట్ (22వ నిమిషంలో), ఆ మరుసటి నిమిషమే హ్యూగో లబోచెరె గోల్‌తో బెల్జియం 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ రెండో అర్ధం ఆరంభమయ్యాకే హర్మన్‌ప్రీత్ గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. అయితే నాలుగో క్వార్టర్‌లో మొదలయ్యాక నికోలస్ గోల్ కొట్టాడు. ఆట మరో 30 సెకన్లలో ముగుస్తుందనగా భారత్‌కు దొరికిన పెనాల్టీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. షూటౌట్‌లో భారత్.. 3 గోల్స్ చేయగా బెల్జియం నాలుగు గోల్స్ కొట్టింది.

RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందరి హక్కు...
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily
శనివారం 29 ఆగస్టు 2026

## సంపాదకీయం

# హిమానీనద ప్రళయం!

ఒక భారీ మంచు-రాతి హిమపాతానికి కారణమై, నేపాల్, టిబెట్‌లలోని తీర్థయాత్రికులకు, ట్రెక్కర్లకు ప్రసిద్ధి చెందిన ప్రాంతాల్లో అపారమైన వరదలకు దారితీసింది. వేలాది మంది, పలు దేశాలకు చెందిన వ్యక్తుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన, 2004 సునామీ తర్వాత అతిపెద్ద అంతర్జాతీయ విషాదంగా నిలిచింది. 0.2 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల హిమానీనదంలో ఒక భాగం, 5,200 మీటర్ల ఎత్తునుంచి విరిగిపడి, 1,200 మీటర్లు నిట్టనిలువుగా లోయలోకి దూసుకుపోయి, రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రత గల భూకంపానికి సమానమైన ప్రకంపనలను నమోదు చేసింది. బురద, నీరు, శిథిలాలతో కూడిన ఆ ప్రళయ ప్రవాహం కిందకు దూసుకొచ్చినప్పుడు, ఆ మార్గంలో ఉన్నవారికి తప్పించుకునే సమయం చాలా తక్కువగా దొరికింది. త్రిశూలి నది (భోటేకోశీ అని కూడా పిలుస్తారు) కేవలం 30 నిమిషాల్లోనే 9 మీటర్లు పైకి లేచిందని చెబుతున్నారు. దిగువ ప్రాంతాలకు అర్థవంతమైన హెచ్చరిక పంపగలిగే ఎలాంటి ముందస్తు హెచ్చరిక వ్యవస్థా దీన్ని ఎదుర్కోగలిగేది కాదు. రాక్షసాకారంలో ఉప్పొంగుతూ, తన సొంత మట్టాన్ని వెతుక్కుంటూ సాగిన ఆ ప్రవాహం, మార్గంలో వచ్చిన ప్రజలను తీసుకుపోయి, వంతెనలు, జలవిద్యుత్ కేంద్ర పరికరాలు, గ్రామాలతోపాటు మనుషులను కూడా నాశనం చేసింది. తాజా గణాంకాల ప్రకారం, నేపాల్‌లో మృతుల సంఖ్య 469కి చేరగా, చైనావైపు మరో ముగ్గురు మృతిచెందారు. 1,300 మందికిపైగా ఇంకా ఆచూకీ లేకుండా పోయారు. వీరిలో టిబెట్‌లోని గిరోంగ్ కౌంటీలోనే 558 మంది ఉన్నారని, అందులో 260మంది విదేశీయులని చైనా అధికారిక మీడియా సీసీటీవీ వెల్లడించింది. గ్లోబల్ వార్మింగ్ యుగంలో, హిమనీనద విధ్వంసాల గురించి భయానకంగా, ఆకస్మికంగా ఉండే ఒక విషయం ఏమిటంటే -మనుషులు వీలైనంత దూరంగా జీవించడం, ఉండటం తప్ప మరో మార్గం లేకపోవడమే.

హిమనీనద విధ్వంసాలకు, వాతావరణ మార్పులకు మధ్య సంబంధం ఇప్పటికీ ఒక పరికల్పనగానే ఉన్నా, గ్లోబల్ వార్మింగ్ హిమనీనదాలను వెనక్కి తగ్గించడానికి కారణమవుతోందన్నది సుస్థిర శాస్త్రీయ వాస్తవం. హిమాలయాలు ప్రపంచ సగటు కంటే రెండింతలు వేగంగా వేడెక్కుతున్నాయని, గత మూడు దశాబ్దాల్లో నేపాల్ తన మంచులో మూడోవంతు కోల్పోయిందని కూడా గణాంకాలున్నాయి. అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం, నేపాల్, భారత్, టిబెట్‌లలో మొత్తం 3,624 హిమనీనద సరస్సులను గుర్తించగా, వాటిలో 47 సరస్సులు ప్రమాదకరమైనవిగా వర్గీకరించబడ్డాయి. ఇలాంటి వాస్తవాలే ఈ విషాదాలను వాతావరణంపై మానవ ప్రభావంతో ముడిపెట్టడానికి వీలు కల్పిస్తున్నాయి. హిమాలయ పర్వత ప్రాంతం ఎంత సున్నితమైనదో, మానవ కార్యకలాపాలు దానికి తోడైన భారీ కర్బన పాదముద్ర ఎంత హానికరమో పర్యావరణవేత్తలు ఏళ్లుగా ప్రపంచాన్ని హెచ్చరిస్తూనే వస్తున్నారు. నేపాల్‌లోని నిటారుగా, అందంగా ఉండే లోయలు గొప్ప పర్యాటక మార్గాలుగా కనిపించొచ్చు, కానీ విపత్తు సంభవించినప్పుడు అవి ఉండదగిన ప్రాంతాలు మాత్రం కావు. కంప్యూటర్ గ్రాఫిక్స్ యుగంలో తీసిన హర్రర్ సినిమానుంచి నేరుగా వచ్చినట్టుండే ఆ దృశ్యాలు, ప్రకృతి తిరుగులేని శక్తికి సాక్ష్యంగా నిలిచిన ఒక నిర్జన, భయానక భూభాగాన్ని మిగిల్చాయి. రసువా జిల్లాలో ఎగువ త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న 350మంది కార్మికులను, నివాసితులను నేపాల్ సైన్యం విషమ వాతావరణంలోనూ ధైర్యంగా రక్షించడం ఈ విషాదంలో ఒక ఆశాకిరణంగా నిలిచింది. చైనా ప్రధాని లీ కియాంగ్ స్వయంగా టిబెట్‌లోని విధ్వంస ప్రాంతాన్ని సందర్శించి, అత్యవసర సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, గండక్ నదీ పరీవాహక ప్రాంతానికి వరద ముప్పు పొంచి ఉండటంతో, బిహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సరిహద్దు రాష్ట్రాల నుంచి భారత్ వేలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఇరుగుపొరుగు దేశాలు ఏకతాటిపైకి వచ్చి సహాయక చర్యలు చేపట్టడం గమనార్హం. అయితే, ఆందోళన ఇంకా సద్దుమణగలేదు -అసలు విపత్తు జరిగిన ప్రాంతంలోనే కొత్తగా ఒక సరస్సు ఏర్పడి, నీటిమట్టం పెరుగుతోందని, ఇది పగిలిపోతే దిగువ ప్రాంతాల్లో మరో వరదకు దారితీయవచ్చని నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. దీనికితోడు, గురువారం రాత్రి టిబెట్‌లోని నాగ్కులో 4.7 తీవ్రతతో మరో భూకంపం సంభవించడం, ఇప్పటికే విషాదంలో మునిగిన ఈ ప్రాంతంలో ఆందోళనలను మరింత పెంచింది. సరిహద్దును ఇంతటి తీవ్రతతో తాకిన ఈ విషాదానికి సంబంధించి చైనా వైపునుంచి విశ్వసనీయ సంఖ్యాపరమైన సమాచారం చాలా తక్కువగా వస్తుండటంతో, మృతుల సంఖ్య ఇంకా ఎంత పెరగవచ్చో ఊహించవచ్చు. నేపాల్‌లోని పవిత్ర హిందూ క్షేత్రాలను, అలాగే భారత్-చైనా సంబంధాల్లో మంచు కరగడం అనంతరం గత ఏడాదే భారతీయులకు తిరిగి తెరుచుకున్న చైనాలోని మానససరోవర్ సమీపంలోని కైలాస పర్వతాన్ని ఉత్సాహంగా సందర్శించే భారతీయులకు ఈ విషాదం మరింత హృదయవిదారకంగా అనిపిస్తోంది. మృతుల్లో, గల్లంతైనవారిలో అనేకమంది కైలాస యాత్రికులే ఉన్నారు.

పర్యావరణవేత్తలు, పరిరక్షకులు హిమాలయ పర్వత ప్రాంత పెళుసుదనం, మానవ కార్యకలాపాల హానికర ప్రభావం గురించి ప్రపంచాన్ని హెచ్చరిస్తూనే వచ్చారు. ఈ మహా విషాదానికి కారణం గ్లోబల్ వార్మింగేనని త్వరలోనే స్పష్టంగా నిర్ధారణ అవుతుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ముందుగానే కచ్చితంగా ఊహించడం సాధ్యం కాకపోయినా, దాని పర్యవసానాలకు సన్నద్ధంగా ఉండటం మాత్రం ప్రతి హిమాలయ దేశపు తక్షణ బాధ్యత. హిమాలయ ప్రాంతంలో పర్యాటకాన్ని, తీర్థయాత్రలను జాగ్రత్తగా నియంత్రించడం, హిమానీనద సరస్సుల నిరంతర పర్యవేక్షణను బలోపేతం చేయడం, సరిహద్దు దేశాల మధ్య నిజ-సమయ డేటా పంచుకునే వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలు ఇకపై ఐచ్ఛికం కాదు, అత్యవసరమైనవి. ఈ విషాదం కేవలం నేపాల్, టిబెట్‌లకే పరిమితం కాదు -ప్రపంచవ్యాప్తంగా పర్వత ప్రాంతాల్లో నివసించే, పర్యటించే కోట్లాది మందికి ఇది ఒక తీవ్రమైన హెచ్చరిక. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాలు మరింత తీవ్రంగా, తక్షణంగా వ్యవహరించకపోతే, ఇలాంటి విషాదాలు మరింత తరచుగా, మరింత తీవ్రంగా పునరావృతమయ్యే ప్రమాదముంది. ఇరుగుపొరుగు దేశాల మధ్య ఇప్పుడు కనిపిస్తున్న సహకార స్ఫూర్తి, భవిష్యత్తులో ఇలాంటి ప్రకృతి విపత్తులను ముందుగానే ఎదుర్కోవడానికి ఒక శాశ్వత ప్రాంతీయ వ్యవస్థగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### పనికొచ్చే పలుకు




## ఆలోచనే.. అసలైన ఆర్థిక సూత్రం!

సంపాదన ఒక నైపుణ్యమైతే.. దాన్ని సరిగ్గా ప్రయోగించడం ఒక కళ. సాధారణంగా ఆర్థిక ఇబ్బందులు తక్కువ ఆదాయం వల్ల రావు.. ఆదాయానికి మించిన జీవనశైలిని అలవాటు చేసుకోవడం వల్లే వస్తాయి. జీతం పెరిగినా, వ్యాపారంలో లాభాలొచ్చినా, ఖర్చులు కూడా అదే వేగంతో పెరిగిపోతుంటాయి. ఫలితంగా చేతిలో డబ్బు మిగలదు, మనసులో ప్రశాంతత ఉండదు. నిజానికి ఆర్థిక స్వేచ్ఛకు తొలి అడుగు బ్యాంకు ఖాతాలో కాదు... మన ఆలోచనా విధానంలో పడుతుంది. అందుకే "ఆదాయానికి తగినట్టు జీవించడం" అనేది కేవలం పొదుపు సూత్రం కాదు; మనస్తత్వాన్ని మార్చే జీవన తత్వం!

ప్రస్తుత రోజుల్లో జీవితం.. అవసరాలకంటే ఆకర్షణల చుట్టూ ఎక్కువ తిరుగుతోంది. సోషల్ మీడియాలో కనిపించే విలాసవంతమైన జీవనశైలి, కొత్త గ్యాడ్జెట్లు, బ్రాండెడ్ వస్తువులు, ప్రతి సందర్భాన్ని ఖర్చుతో ముడిపెట్టే అలవాట్లు మనల్ని తెలియకుండానే అప్పులవైపు నడిపిస్తున్నాయి. ఒకప్పుడు "అవసరముందా?" అని ఆలోచించి కొనేవాళ్లు. ఇప్పుడు "అందరికీ ఉంది... నాకూ ఉండాలి" అనే భావనతో ఖర్చు పెడుతున్నారు. ఈ ఆలోచనే ఆర్థిక ఒత్తిడికి కారణం. నిజమైన సంపద అంటే ఎక్కువ వస్తువులు కలిగి ఉండటం కాదు; ఉన్నదానితో ప్రశాంతంగా జీవించగలగడం.

మనస్తత్వం మారితే డబ్బు మీద మన దృష్టి కూడా మారుతుంది. ఉదాహరణకు, నెలకు రూ.50 వేల ఆదాయమున్న ఇద్దరు వ్యక్తులను తీసుకుంటే, ఒకరు వచ్చినంతా ఖర్చు చేసి నెలాఖరుకు అప్పుల్లో పడతారు. మరొకరు అదే ఆదాయంలో అవసరాలను, కోరికలను వేరు చేసి కొంత మొత్తాన్ని పొదుపు చేస్తారు. ఐదేళ్ల తర్వాత ఇద్దరి జీవితాల మధ్య కనిపించే తేడా ఆదాయంలో కాదు, ఆలోచనలో ఉంటుంది. మొదటి వ్యక్తి ఒత్తిడితో జీవిస్తే, రెండో వ్యక్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాడు. అంటే సంపదను నిర్ణయించేది జీతం కాదు, జాగ్రత్త!

ఆర్థిక క్రమశిక్షణ అనేది పెద్ద పెద్ద త్యాగాలతో ప్రారంభం కాదు. చిన్న చిన్న అలవాట్లతో మొదలవుతుంది. అవసరం లేని ఖర్చును ఒక్కసారి ఆపడం, ప్రతి నెల కొంత మొత్తాన్ని ముందుగా పొదుపు చేయడం, ఆకస్మికంగా కొనాలనిపించిన వస్తువు గురించి ఒక రోజు ఆలోచించడం... ఇవన్నీ సాధారణ విషయాలే. కానీ ఈ చిన్న నిర్ణయాలే భవిష్యత్తులో పెద్ద మార్పులకు కారణమవుతాయి. చుక్క చుక్కగా చేరిన నీరు చెరువును నింపినట్టే, రూపాయి రూపాయిగా దాచిన పొదుపు జీవితానికి భరోసా అవుతుంది.

అయితే పొదుపు అంటే జీవితాన్ని ఆస్వాదించకూడదని కాదు. ఆనందాన్ని వాయిదా వేయడం కాదు; ఆనందాన్ని బాధ్యతతో ఆస్వాదించడం. కుటుంబంతో గడిపే సమయం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, మంచి పుస్తకం చదవడం, ప్రకృతిలో నడవడం... ఇవన్నీ పెద్ద ఖర్చు లేకుండానే జీవితానికి విలువను పెంచుతాయి. చివరగా ఒక విషయం గుర్తుంచుకోవాలి... డబ్బు మన జీవితాన్ని నడిపించకూడదు; మనమే డబ్బును నడిపించాలి. అందుకు కావాల్సింది ఖరీదైన కోర్సులు కాదు, కొత్త యాప్‌లు కాదు, ఆర్థిక నిపుణుల సలహాలు మాత్రమే కాదు. మన మనస్తత్వంలో ఒక చిన్న మార్పు. ఆ మార్పు వచ్చినప్పుడు ఖర్చులో హద్దు వస్తుంది, పొదుపులో అలవాటు వస్తుంది, జీవితంలో ప్రశాంతత వస్తుంది. ఎందుకంటే నిజమైన సంపద... బ్యాంకు బ్యాలెన్స్‌లో కాదు, బాధ్యతతో తీసుకున్న నిర్ణయాల్లో ఉంటుంది కనుక.

# అప్పుడు.. ప్రపంచ నగరమయ్యేది!



ఒక నగరం రాజధానిగా మారడం పరిపాలనా నిర్ణయం. కానీ అదే నగరం ఆర్థిక శక్తిగా ఎదగడం మాత్రం దూరదృష్టి, సమగ్ర ప్రణాళిక, నిరంతర కృషితోనే సాధ్యం. ప్రభుత్వ భవనాలు, విశాలమైన రహదారులు, కార్యాలయ సముదాయాలతో రాజధాని రూపుదిద్దుకోవచ్చు. కానీ అక్కడ పరిశ్రమలు రావాలి. పెట్టుబడులు పెట్టాలి. ఉద్యోగాలు పుట్టాలి. వ్యాపారాలు విస్తరించాలి. విద్య, వైద్యం, సాంకేతికత, సేవారంగాలు వేళ్లూనుకోవాలి. అప్పుడే అది నిజమైన ఆర్థిక కేంద్రమవుతుంది. ఈ కీలక దశలోనే అమరావతి ఉంది. రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం కొత్త ఊపునివ్వడంతో మౌలిక వసతుల పనులు వేగం పుంజుకుంటున్నాయి. రహదారులు, వంతెనలు, ప్రభుత్వ భవనాలు, నీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి కీలక సదుపాయాల నిర్మాణం ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారమూ లభిస్తోంది. ఇవన్నీ అవసరమైన పునాదులే. కానీ ఆ పునాదిపై బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే అసలు సవాలు.


అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగా పరిమితం చేస్తే దాని సామర్థ్యంలో కొంత భాగమే వినియోగించినట్టు. శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ప్రైవేటు రంగం కూడా పెద్దఎత్తున అడుగుపెట్టే వాతావరణం ఏర్పడాలి. ఐటీ, ఫిన్‌టెక్, స్టార్టప్‌లు, బ్యాంకింగ్, కన్సల్టింగ్, విద్య, వైద్యం, పరిశోధన, హెల్త్‌టెక్‌వంటి రంగాలకు అమరావతి అనుకూల గమ్యం కావాలి. ఇందుకోసం భూ కేటాయింపులే సరిపోదు. వేగంగా అనుమతులు, స్థిరమైన విధానాలు, నాణ్యమైన విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రజా రవాణా, మంచి ఇళ్లు, విద్యా-వైద్య సదుపాయాలు అవసరం.

కనెక్టివిటీ అమరావతి భవిష్యత్తును నిర్ణయించే మరో కీలక అంశం. విజయవాడ, గుంటూరు, తెనాలివంటి సమీప నగరాలతో వేగవంతమైన అనుసంధానం ఉండటంతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచీ సులభంగా చేరుకునే రహదారి, రైలు, ప్రజా రవాణా వ్యవస్థలు అవసరం. రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలతో ఎంత బలమైన ఆర్థిక సంబంధాలు ఏర్పడితే అంత వేగంగా దాని ప్రభావ పరిధి విస్తరిస్తుంది. నగరం తన చుట్టూ ఉన్న ప్రాంతాలను వేరుచేయకుండా వాటిని తన ఆర్థిక వ్యవస్థలో భాగం చేసుకున్నప్పుడే అది నిజమైన గ్రోత్ హబ్‌గా ఎదుగుతుంది. అమరావతికి మరో గొప్ప అవకాశం నాలెడ్జ్ ఎకానమీ. భవిష్యత్తులో నగరాల విలువను కేవలం భూములు, భవనాలు నిర్ణయించవు. జ్ఞానం, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలే ప్రధాన ఆస్తులుగా మారుతున్నాయి. క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బయోటెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాలకు అమరావతిలో స్థానం కల్పించాలి. ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఇన్నోవేషన్ ల్యాబ్‌లు, స్టార్టప్ ఇంక్యుబేటర్లు ఒకే పర్యావరణ వ్యవస్థగా ఏర్పడాలి. 'చదువు ఇక్కడ.. పరిశోధన ఇక్కడ.. స్టార్టప్ ఇక్కడ.. ఉద్యోగం ఇక్కడ' అనే చక్రం తిరిగితేనే అమరావతి యువతకు అవకాశాల నగరమవుతుంది.

రియల్ ఎస్టేట్ అభివృద్ధిని కూడా సమతుల్యంగా నిర్వహించాలి. రాజధాని నిర్మాణంతో భూముల విలువలు పెరగడం సహజమే. కానీ భూముల ధరలు పెరగడాన్నే ఆర్థిక అభివృద్ధిగా భావించడం సరైంది కాదు. నగరంలో ఇళ్లు సాధారణ ఉద్యోగులు, మధ్యతరగతి, యువతకు అందుబాటులో లేకపోతే సామాజిక అసమతుల్యత తప్పదు. అందుకే విలాసవంతమైన నివాస సముదాయాలతోపాటు అందుబాటు ధరల్లో గృహాలు, అద్దె ఇళ్లు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు అవసరమైన నివాస సదుపాయాలు కూడా ఉండాలి. నగరం ఎంత పెద్దదోకంటే ఎంతమందికి అందుబాటులో ఉందన్నదే దాని విజయానికి కొలమానం.

రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా ఈ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. రాజధాని అభివృద్ధి వల్ల వారికి కలిగే ప్రయోజనం కేవలం భూమి విలువ పెరగడానికే పరిమితం కాకూడదు. చిన్న వ్యాపారాలు, రిటైల్, హాస్పిటాలిటీ, రవాణా, సేవారంగాల్లో అవకాశాలు కల్పించాలి. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. కొత్త నగరంలో ఏర్పడే ఆర్థిక కార్యకలాపాల్లో స్థానికులకు భాగస్వామ్యం కల్పించినప్పుడే రాజధాని నిర్మాణం సామాజికంగా కూడా విజయవంతమవుతుంది. ఉద్యోగాల సృష్టి అమరావతి విజయాన్ని కొలిచే ప్రధాన ప్రమాణంగా ఉండాలి. భారీ పెట్టుబడులు వచ్చాయని చెప్పడం కంటే వాటి ద్వారా ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? స్థానిక యువతకు ఎన్ని అవకాశాలు లభించాయి? అనే ప్రశ్నలకు సమాధానముండాలి. ఇండస్ట్రీలకు అవసరమైన నైపుణ్యాలను ముందుగానే గుర్తించి, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు కంపెనీల మధ్య భాగస్వామ్యాలు ఏర్పాటు చేయాలి. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉంటేనే పెట్టుబడులు నిలుస్తాయి. ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితిని మార్చి.. కంపెనీలే అమరావతికి వచ్చే వాతావరణం సృష్టించాలి.

అయితే అమరావతి అభివృద్ధి అంటే మిగతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని పక్కన పెట్టడం కాదు. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, నెల్లూరు, కర్నూలు, అనంతపురం వంటి నగరాలకు ప్రత్యేక ఆర్థిక బలాలున్నాయి. విశాఖ సముద్ర ఆర్థిక వ్యవస్థ, ఐటీ, పరిశ్రమలకు కేంద్రంగా ఎదగవచ్చు. తిరుపతి పర్యాటకం, విద్య, వైద్యం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బలపడవచ్చు. రాయలసీమ పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా మారవచ్చు. అమరావతి పరిపాలన, ఫైనాన్స్, నాలెడ్జ్, సేవారంగాలకు కేంద్రంగా ఎదిగితే.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు తమ ప్రత్యేక రంగాల్లో అభివృద్ధి చెందేలా 'మల్టీ-సిటీ గ్రోత్ మోడల్'ను రూపొందించాలి. అమరావతి ఎదుగుదల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అవకాశాలను సృష్టించాలి. ప్రపంచస్థాయి నగరాల అనుభవం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. నగరాలను గొప్పగా చేసేది వాటి భవనాల ఎత్తు కాదు.. అక్కడ సృష్టించే అవకాశాల ఎత్తు. అమరావతికి ఇప్పుడు అలాంటి చారిత్రక అవకాశం వచ్చింది. మౌలిక వసతుల నిర్మాణం వేగం పుంజుకోవడం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారం, పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు, సాంకేతిక రంగాలపై దృష్టి.. ఇవన్నీ బలమైన పునాదిని నిర్మిస్తున్నాయి. కానీ ఆ పునాదిపై కాంక్రీట్ నగరం మాత్రమే కాదు.. అవకాశాల నగరం నిర్మించాలి. అందుకే ఇకపై అమరావతి విజయాన్ని 'ఎన్ని భవనాలు పూర్తయ్యాయి?' అనే ప్రశ్నతో కాకుండా.. 'ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? ఎంత పెట్టుబడి వచ్చింది? ఎన్ని స్టార్టప్‌లు ఏర్పడ్డాయి? ఎన్ని పరిశోధనా సంస్థలు వచ్చాయి? యువతకు ఎన్ని అవకాశాలు లభించాయి? స్థానిక ప్రజల ఆదాయం ఎంత పెరిగింది?' అనే ప్రశ్నలతో కొలవాలి. రాజధాని భవనాలు ప్రభుత్వానికి చిరునామా ఇస్తాయి. కానీ పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ఉద్యోగాలు, పెట్టుబడులు నగరానికి ఆర్థిక శక్తిని ఇస్తాయి. అదే ఇప్పుడు రాష్ట్రం ముందున్న అసలు లక్ష్యం. ■



జీవితంలో తిరుగులేని, శాశ్వతమైన స్థిరత్వాన్ని నిర్మించాలంటే.. ప్రయాణంలో ఎదురయ్యే కొన్ని తాత్కాలిక సరదాలు, క్షణికమైన ఆనందాలు వదిలేయాలి. ప్రతి కోరికను వెంటనే తీర్చుకోవడం కన్నా, భవిష్యత్తు కోసం ఈరోజు కొంత నియంత్రణ పాటించడం ముఖ్యం. ఈరోజు మీరు చేసే చిన్న త్యాగాలే, రేపటి మీ స్వేచ్ఛకు, విజయానికి బలమైన పునాదిగా మారతాయి. కష్టాలను ఓర్చుకుని, లక్ష్యంపై దృష్టి నిలిపినప్పుడు మనలో క్రమశిక్షణ పెరుగుతుంది. తాత్కాలిక ఆనందాలను వదులుకున్నప్పుడే దీర్ఘకాలిక సంతృప్తి దక్కుతుంది. గెలుపు ఒక్కరోజులో రాదు. నిరంతర శ్రమ, సహనం, త్యాగం, నమ్మకంతోనే అది సొంతమవుతుంది.

-మహాదేవ


### వింతల్లో వింతలు

## బిగ్ ఫుట్.. కలకలం!




అమెరికాలోని పెన్సిల్వేనియాలో 'మినీ బిగ్‌ఫుట్' కనిపించిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇండియానా, వెస్ట్‌మోర్‌లాండ్ కౌంటీల్లో వేర్వేరు సందర్భాల్లో చిన్నగా, మనిషిలా నిటారుగా నడిచే వింత జీవులను చూసినట్టు ఇద్దరు వ్యక్తులు తెలిపారు. వాటి శరీరం గోధుమ, బూడిద రంగు వెంట్రుకలతో కప్పబడి ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో గతంలోనూ బిగ్‌ఫుట్ దర్శనాలకు సంబంధించిన కథనాలు వెలుగుచూశాయి. దీంతో తాజా ఘటనలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే, అవి నిజంగా ఏ జీవులో, కేవలం అపోహలో అన్నది ఇప్పటికీ అంతుచిక్కని మిస్టరీగానే మిగిలింది. ఇలాంటి వింత జీవుల ఆనవాళ్లు గతంలోనూ ఈ ప్రాంతంలోని అడవుల్లో కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. తాజా దర్శనాలపై సోషల్ మీడియాలోనూ చర్చ మొదలైంది. అయితే, ఈ జీవుల ఉనికిని నిర్ధారించే శాస్త్రీయ ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

## నైజాంలో 'ఇరుముడి' కలెక్షన్ల సునామీ..
## రవితేజ కెరీర్‌లో మరో భారీ హిట్!



మాస్ మహారాజా రవితేజ హీరోగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. భిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచి మంచి స్పందన అందుకుంటూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై వివాదం కొనసాగుతున్నప్పటికీ.. కలెక్షన్ల జోరుపై మాత్రం దాని ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు. ముఖ్యంగా తెలంగాణలోని నైజాం మార్కెట్‌లో 'ఇరుముడి' తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. తొలి వారంలోనే తెలంగాణ వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏడు రోజుల ముగిసేసరికి నైజాం ఏరియాలో సుమారు రూ.26 కోట్లకు పైగా డిస్ట్రిబ్యూటర్ షేర్ వచ్చినట్లు సమాచారం.తెలంగాణ టూరిజం సాధారణ వర్కింగ్ డే అయిన ఏడో రోజున కూడా తెలంగాణలో దాదాపు రూ.3 కోట్ల మేర వసూళ్లు నమోదు కావడం సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న లాంగ్ వీకెండ్ 'ఇరుముడి'కి మరింత కలిసొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం వరకు అదనంగా భారీ వసూళ్లు రాబట్టే అవకాశం ఉండటంతో, తెలంగాణలో రూ.70 కోట్ల గ్రాస్ మార్కును చేరుకోవడంపై అంచనాలు పెరుగుతున్నాయి. 'ధమాకా' తర్వాత రవితేజ కెరీర్‌లో ఈ స్థాయిలో మాస్ రీచ్, కలెక్షన్ల జోరు కనిపిస్తున్న చిత్రం 'ఇరుముడి' అని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. రవితేజ ఎనర్జీ, ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర నటనతో పాటు శివ నిర్వాణ దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక సినిమాలోని 'మల్లెపూల పల్లకి' పాట చార్ట్‌బస్టర్‌గా మారి ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్, ఇతర ప్రాంతాల్లోనూ సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్నప్పటికీ.. నైజాం మార్కెట్‌లో నమోదవుతున్న రికార్డు స్థాయి వసూళ్లు ప్రత్యేకంగా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే పలు థియేటర్లలో హౌస్‌ఫుల్ ప్రదర్శనలతో దూసుకుపోతున్న 'ఇరుముడి'.. ఈ లాంగ్ వీకెండ్ ముగిసే నాటికి ఇంకెన్ని కొత్త రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. రవితేజ అభిమానులు మాత్రం ఈ విజయాన్ని ఫుల్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

## అక్కినేని నాగార్జున బర్త్‌డే స్పెషల్.. 'కింగ్ 100' టైటిల్ గ్లింప్స్ అప్‌డేట్



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్ఠాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.వీశీజఅవం నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్... రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## 'రేస్ 4'లో ఆమిర్ ఖాన్.. 'ధూమ్ 3' దర్శకుడితో భారీ యాక్షన్ థ్రిల్లర్?



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచర్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



## రాఖీ యాడ్ వివాదం.. ట్రోలర్స్‌కి మరోసారి కౌంటరిచ్చిన కృతి సనన్

రాఖీ పర్వదినం సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఓ ఆభరణాల ప్రకటన సోషల్ మీడియాలో ఇటీవల తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ యాడ్‌లో కృతి ధరించిన దుస్తులు, అలాగే పెంపుడు కుక్కకు రాఖీ కట్టడంపై కొందరు నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఈ ట్రోలింగ్‌పై కృతి సనన్ తాజాగా సోషల్ మీడియా వేదికగా మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చారు. తన సోదరి నుపుర్ సనన్‌తో కలిసి రాఖీ పండుగను జరుపుకున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న కృతి ఒక పోస్ట్ పెట్టింది. ఈ ఫొటోలో ఇద్దరి చేతులు మాత్రమే కనిపిస్తుండగా, ఇద్దరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఉన్నారు. (రాఖీ ఫ్యాషన్ కమిటీ ఇంకా సమావేశంలోనే ఉన్నట్లుంది.. కానీ మేం మాత్రం అసలైన విషయాలపైనే దృష్టి పెట్టాం అంటూ) ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టు ద్వారా తన దుస్తులను విమర్శించిన వారికి ఆమె పరోక్షంగా చురకలంటించారు. అంతకుముందు కూడా మహిళల దుస్తుల ఆధారంగా వారి సంస్కృతిని, సంప్రదాయాలను జడ్జ్ చేయడంపై కృతి తీవ్రంగా స్పందించారు. పండుగలలో ముఖ్యం భావోద్వేగాలే తప్ప దుస్తులు కాదని ఆమె స్పష్టం చేశారు.

## నాని 'ది ప్యారడైజ్' నుంచి క్రేజీ అప్‌డేట్.. 'యెష నాగుల' సాంగ్ వచ్చేది అప్పుడే!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని రెండో సింగిల్ డిజిటల్ లాంచ్‌కు రంగం సిద్ధమైంది. 'యెష నాగుల' అంటూ సాగే ఈ పాటను రేపు అధికారికంగా విడుదల చేయనుండగా.. దానికి ముందుగా ఈరోజు సాయంత్రం ఈ సాంగ్‌ను అనిరుధ్ కన్సర్ట్‌లో పాడబోతున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ పాటకు శ్యామ్ లిరిక్స్ అందించగా.. జంగి రెడ్డి, సందీప్ కుమార్ ఆలపించారు. అలాగే సందీప్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ చేయడం విశేషం. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలీ కులకర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com